ప్రజాశక్తి

మంగళవారం 28 అక్టోబర్ 2025 8 పేజీలు

ఎన్‌టిఆర్ కృష్ణా





హై అలర్ట్

- తుపాను నేపథ్యంలో ముందస్తు చర్యలు
- కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల్లో 405 పునరావాస కేంద్రాలు
- పలు రైళ్లు రద్దు
- నేడు విజయవాడ భారీ వర్ష సూచన
- అధికార యంత్రాంగం అప్రమత్తం





విజయవాడలో కొండ ప్రాంతాలను పరిశీలిస్తున్న కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ, విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర; కృత్తివెన్ను మండలంలో ఏర్పాటు చేసిన పునరావాస శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంఎల్ఎ కృష్ణ ప్రసాద్; గుడ్లవల్లేరు మండలం వడ్లమన్నాడులో విద్యుత్ లైన్లక మరమ్మతులు దృశ్యం

ప్రజాశక్తి- కృష్ణా ప్రతినిధి, విజయవాడ

మొంథా తుపాను ప్రభావంతో సోమవారం పలుచోట్ల వర్షాలు కురిశాయి. తుపాను తీరం దాటే సమయంలో తీవ్ర ప్రభావం ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. దీంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలను రక్షించేందుకు ముందస్తు చర్యలు తీసుకుంటోంది. కృష్ణాజిల్లాలో 238 గ్రామాల్లో 16,124 మంది తుపాను ప్రభావానికి గురవుతారని అంచనా వేసింది. 216 తాత్కాలిక పునరావాస శిబిరాలను అధికారులు గుర్తించారు. 161 శిబిరాలను సిద్ధం చేసి ప్రభావిత ప్రాంతాల్లోని 5,120 మందిని తరలించారు. మత్స్యకారులు బోట్లు వడ్డుకు చేరాయి. వాతావరణ పరిస్థితులు అనుకూలించే వరకు వేటకు వెళ్లవద్దని అధికారులు సూచించారు. సముద్రతీరంలో బీచ్‌లకు సందర్శకులను అనుమతించడం లేదు. 28, 29 తేదీల్లోనూ ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలకు సెలవు ప్రకటించారు. మచిలీపట్నం రెవెన్యూ డివిజన్ కేంద్రంలో రెండు, గుడివాడ, ఉయ్యూరు డివిజన్ కేంద్రాల్లో ఒక్కొక్కటి చొప్పున, వీటితోపాటుగా మండలానికి ఒకటి చొప్పున 50 కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశారు.



తుపాను జోనల్ ప్రత్యేక అధికారి, చేనేత జౌళి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా అన్ని శాఖల అధికారులతో సమావేశమై పలు సూచనలు చేశారు. కలెక్టర్ డి.కె.బాలాజీ, ఎస్‌పి విద్యాసాగర్ నాయుడులు బంటుమిల్లి, కృత్తివెన్ను, పెడన మండలాల్లో, ప్రత్యేక అధికారి అమ్రపాలి, జాయింట్ కలెక్టర్ ఎం. నవీన్ గిలకలదిండి, గరాలదిబ్బ గ్రామాల్లో ఏర్పాటు చేసిన పునరావాస శిబిరాలను సందర్శించారు.

పునరావాస శిబిరాల్లో 5,120 మంది

మచిలీపట్నం రెవెన్యూ డివిజన్లోని 12 మండలాల్లోని 104 గ్రామాల్లో 7,465 మంది తుపాను ప్రభావానికి గురవుతారని అంచనా. 114 పునరావాస శిబిరాలను గుర్తించారు. ఆయా గ్రామాల్లో 88 శిబిరాలు ప్రారంభించారు. 1303 కుటుంబాలకు చెందిన మహిళలు 1712 మంది, పురుషులు 1559 మందిని మొత్తం 3,015 మందిని పునరావాస శిబిరాలకు తరలించారు. 3,494 ఆహార పొట్లాలను అందించారు. 547 వాటర్ క్యాన్‌లు సరఫరా చేశారు. గ్రామాల్లో 10 వాటర్ ట్యాంకర్లను అందుబాటులో ఉంచారు. గుడివాడ డివిజన్‌లోని ఏడు మండలాల్లో 73 గ్రామాల్లో 4,284 మంది ప్రభావానికి గురవుతారని అంచనా. 39 తాత్కాలిక పునరావాస శిబిరాలను గుర్తించారు. 18 చోట్ల శిబిరాలను ప్రారంభించారు. 132 కుటుంబాలకు సంబంధించి మహిళలు 181, పురుషులు 132 మంది మొత్తం 313 మందిని పునరావాస శిబిరాలకు చేర్చారు. 323 ఆహార ప్యాకెట్లు, 115 వాటర్ క్యాన్‌లు అందించారు. ఉయ్యూరు రెవెన్యూ డివిజన్‌లో 61 గ్రామాల్లో 4,375 మంది ప్రభావానికి గురవుతారని అంచనా. 63 తాత్కాలిక పునరావాస శిబిరాలను గుర్తించారు. 55 శిబిరాలు ప్రారంభించారు. 611 కుటుంబాలకు సంబంధించి 976 మంది మహిళలు, 816 మంది పురుషులను పునరావాస శిబిరాలకు తరలించారు. మొత్తం 5,120 (మిగతా 2లో)

బ్యారేజీకి పెరిగిన వరద

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణానదికి స్వల్పంగా వరద ప్రవాహం పెరిగింది. ఎగువున కురుస్తున్న వర్షాల కారణంగా కృష్ణానదిలోకి 73,896 క్యూసెక్కుల వరద నీరు చేరుతోంది. సోమవారం రాత్రి 8 గంటల సమయానికి ప్రకాశం బ్యారేజీ నుంచి 76,280 క్యూసెక్కుల వరద నీటిని సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజి 70 గేట్లలో ఒక గేటు సాంకేతిక లోపం కారణంగా మూసి వేశారు. ఇక మిగిలిన 69 గేట్లలో 30 గేట్లను రెండడుగులు, 39 గేట్లను అడుగుమేర పైకెత్తి వరద నీటిని దిగుకు విడుదల చేస్తున్నారు. కృష్ణా డెల్టా ప్రధాన కాల్వలకు నీటి విడుదలను నిలుపుదల చేశారు. బ్యారేజీ పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 12 అడుగులు కాగా, ప్రస్తుతం 11.8 అడుగుల మేర వరద ప్రవాహం కొనసాగుతోంది. పులిచింతల నుంచి 66,495 క్యూసెక్కులు, పాలేరు ద్వారా 1,885, మున్నేరు (కీసర) ద్వారా నుంచి 5,516 క్యూసెక్కుల వరద ప్రవాహం బ్యారేజీకి చేరుతున్నట్లు ఇరిగేషన్ అధికారులు ప్రకటించారు.



దొంగపట్టివేత

రూ.కోటికిపైగా ఆభరణాలు స్వాధీనం

వార్త లోపలి పేజీలో

వెంటనే బ్రిడ్జి నిర్మించాలి

- సిపిఎం రాష్ట్ర నేత సిహెచ్.బాబురావు డిమాండ్
- కట్టలేరుపై హైలెవెల్ వంతెన కోసం సిపిఎం ప్రదర్శన, బైక్ ర్యాలీ
- తిరువూరు ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా
- ఆర్‌డిఒ హామీతో ఆందోళన విరమణ
- స్పందించిన జెసి ఇలక్కియ

ప్రజాశక్తి - తిరువూరు, గంపలగూడెం : వినగడప వద్ద కట్టలేరుపై వంతెన కూలిపోయి ఎనిమిదేళ్లవుతున్నా పాలకులు ఇప్పటి వరకు హైలెవెల్ బ్రిడ్జి నిర్మించకపోవడం సిగ్గుచేటని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబురావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని విమర్శించారు. ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గం గంపలగూడెం మండలం వినగడప వద్ద కట్టలేరుపై వెంటనే హై లెవెల్ బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్ చేస్తూ సోమవారం సిపిఎం ఆధ్వర్యాన వివిధ రూపాల్లో ఆందోళనలు నిర్వహించారు. 'చలో తిరువూరు ఆర్‌డిఒ కార్యాలయం' చేపట్టి బైక్ ర్యాలీ నిర్వహించారు. తొలుత ఎమిదేళ్ల క్రితం బ్రిడ్జి కుప్పకూలిన ప్రదేశంలో ధర్నా చేశారు. అనంతరం తోటమూల మీదగా గంపలగూడెం సాయి బాబా గుడి వరకు పలు గ్రామాల ప్రజలు, సిపిఎం నాయకులు, కార్యకర్తలు ప్రదర్శన నిర్వహించారు. అక్కడి నుండి తిరువూరు మధిర రోడ్డు మీదుగా బైక్ ర్యాలీ చేపట్టారు. బైక్ ర్యాలీ మధిర రోడ్డు నుండి తిరువూరు (మిగతా 2లో)



జెసి ఇలక్కియాకు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నేతలు





కట్టలేరుపై కూలిపోయిన పాత వంతెన వద్ద ధర్నా చేస్తున్న సిపిఎం శ్రేణులు, ప్రజలు, తిరువూరు ఆర్‌డిఒ కార్యాలయానికి బైక్ ర్యాలీగా వెళుతూ...

తుపాను ఎఫెక్ట్ !

- కొండెక్కిన కూరగాయల ధరలు
- ఉదయానికే రైతు బజారులు ఖాళీనిల్
- బహిరంగ మార్కెట్లలో రెట్టింపుతో విక్రయాలు

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

మొంథా తుపాను ప్రభావం అప్పుడే కూరగాయల ధరలపై పడింది. తుపానును ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం ముందస్తు చర్యలకు ఉపక్రమించింది. ముందు జాగ్రత్తగా అప్రమత్తంగా ఉండడంతోపాటు మూడు నాలుగు రోజులకు సరిపడా నిత్యావసరాలు, కూరగాయలు నిల్వ చేసుకోవాలని అధికారులు ప్రకటించడంతో రైతు బజార్లు, బహిరంగ మార్కెట్లలో కూరగాయల కొనేందుకు ప్రజలు క్యూకట్టారు. దీంతో వ్యాపారులు కూరగాయల ధరలు పెంచి అమ్ముతుండడంతో ప్రజలు ఆ ధరలు చూసి బెంబేలెత్తేపోతున్నారు. మచిలీపట్నం, ఉయ్యూరుల్లోని రెండు రైతుబజార్లలోనూ సోమవారం ఉదయం 10 గంటలకే కూరగాయలు ఖాళీ అయ్యాయి. 10 గంటలు దాటిన తర్వాత ఆకుకూరలు, కొత్తిమేర, పొదీన చూద్దామన్నా కనిపించలేదు. దీంతో రైతు బజార్లకు సమీపంలో ఏర్పాటు చేసిన ప్రయివేటు కూరగాయల దుకాణాల వద్ద వినియోగదారులు కూరగాయలు



ఖాళీ అయిన ఉయ్యూరు రైతు బజారు

కొనుగోలు చేయాల్సి వచ్చింది. అయితే ప్రయివేటు వ్యాపారులు ఆకస్మికంగా కూరగాయల ధరలను రెట్టింపు పెంచేశారు. తప్పని పరిస్థితుల్లో వ్యాపారులు చెప్పిన ధరలకే వినియోగదారులు కూరగాయలు కొనుగోలు చేయాల్సి వచ్చింది. మార్కెట్లో ధరలు అధికంగా ఉండటంతో మధ్యతరగతి, సామాన్య ప్రజలు కిలో అవసరమైతే అరకిలో, పావుకిలో చొప్పున కొని సరిపెట్టుకున్నారు.

కృష్ణానదిలో ఇటీవల రోజుల తరబడి వరద నీరు ప్రవహించింది. దీంతో నదీ పరీవాహక ప్రాంతాల్లో నదీపాయను ఆనుకుని ఉన్న లంక భూముల్లో (మిగతా 2లో)

విపత్తుల సమయంలో సేవలు ఉద్యోగుల కర్తవ్యం : విద్యాసాగర్

విజయవాడ : ప్రకృతి విపత్తుల తరుణంలో ప్రజలకు అవసరమైన సేవలందించడం ఉద్యోగుల ప్రధాన కర్తవ్యమని, మొంథా తుఫాను తీవ్రత నేపథ్యంలో అధికారులకు అండగా నిలిచి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలత్తెకుండా అలుపెరగని సేవలందించాలని ఏపిఎన్జివో రాష్ట్ర అధ్యక్షులు ఎ. విద్యాసాగర్ సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పిలుపినిచ్చారు. ప్రతి ఒక్కరు తుఫాను ముందు జాగ్రత్త చర్యలలోను తుఫాను తీవ్రత నుండి బయటపడేవరకు జిల్లా యంత్రాంగం అప్పగించిన భాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు.

హెల్త్ వర్సిటీ ఉద్యోగ పరీక్షలు వాయిదా

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం ఈనెల 29, 30 తేదీల్లో నిర్వహించాల్సిన సిస్టం అడ్మినిస్ట్రేటర్, కంప్యూటర్ ఆపరేటర్, డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగ నియామకాల స్కిల్ టెస్ట్‌ను వాయిదా వేసినట్లు యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ వి రాధికా రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలను నవంబర్ 05, 06 తేదీల్లో నిర్వహిస్తామని తెలిపారు. తుపాన్ నేపథ్యంలో చేసిన మార్పును అభ్యర్థులు గమనించాలని సూచించారు.

హాయి హాయిగా సాగిన సంగీత విభావరి

విజయవాడ : అనిత ఆర్ట్స్ సమర్పించు "పాట పాడుదాం – 4" తెలుగు, హిందీ సినీ సంగీత విభావరి సోమవారం రాత్రి గాంధీనగర్ ఆశిష్ స్టూడియోలో హాయి హాయిగా సాగింది. ప్రముఖ ఔత్సాహిక గాయనీ గాయకులు పవన్ కుమార్ గొర్రెపాటి (టీం లీడర్), తల్లపురెడ్డి శ్రీనివాసరెడ్డి (సంగీత సామ్రాట్), ప్రసాద్ రెడ్డి, వడ్డాది కామేశ్వరి, రంజాన్ బీ, సువర్ణలక్ష్మి, డి.పద్మజ, స్రవంతికష్ణ, మూర్తి, మీసాల బాబ్జి, భాస్కర్ తదితర గాయకులు పలు సినిమాల్లోని సోలో, యుగళ గీతాలు జనరంజకంగా పాడి కార్యక్రమాన్ని పండించారు.

మొదటిపేజీ తరువాయి



ఆర్‌డిఒ మాధురికి వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నేతలు బాబురావు, డి.వి.కృష్ణ, మేకల నాగేంద్ర ప్రసాద్, పి.వి.ఆంజనేయులు, సానికొమ్ము నాగేశ్వరరెడ్డి, గువ్వల సీతారామిరెడ్డి, మద్దిరెడ్డి వెంకటరెడ్డి తదితరులు

వెంటనే బ్రిడ్జి నిర్మించాలి

మెయిన్ రోడ్డు గుండా సాగి ఆర్‌డిఒ కార్యాలయానికి చేరుకుంది. అనంతరం ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. పభుత్వం మొండి వైఖరిని వీడి బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టాలని ఆందోళనకారులు ఆర్‌డిఒ కార్యాలయంలోకి వెళ్లి నినాదాలు చేశారు. దీంతో సిపిఎం నేతలతో ఆర్‌డిఒ మాధురి తన ఛాంబర్లో చర్చలు జరిపారు. అనంతరం ఆర్‌డిఒకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర నాయకులు సిహెచ్.బాబురావు మాట్లాడుతూ బ్రిడ్జి నిర్మాణంపై స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వాగుకు ఎగువున ఉన్న గ్రామాల ప్రజలు మండల కేంద్రమైన గంపలగూడెం రావాలంటే అనుముల్లంక, కనుమూరు, చికుళ్ళగూడెం, జి.కొత్తూరు, గానుగపాడు, చింతలపాడు గ్రామాల మీదగా 30 కిలో మీటర్ల మేర ప్రయాణించి రావాల్సి వస్తోందన్నారు. పాఠశాలలకు వెళ్లిన పిల్లలు తిరిగి ఇంటికి వచ్చేవరకు తల్లిదండ్రులు భయాందోళన చెందాల్సి వస్తోందన్నారు. వాగులో పెద్దపెద రాళ్ళను దాటుకుంటూ వస్తూ కింద పడి నెల రోజుల వ్యవధిలోని 42 మంది గాయపడ్డారని తెలిపారు. డిసెంబర్ మొదటి వారం నాటికి బ్రిడ్జి నిర్మాణానికి టెండర్లు పిలవకపోత ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని చెప్పారు.

నిధులు మంజూరైనట్లు మాయమాటలు చెప్పారు
సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ

బ్రిడ్జి నిర్మిస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం విస్మరించిందని సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ విమర్శించారు. బ్రిడ్జి నిర్మాణానికి రూ.30 కోట్లు మంజూరయ్యాయని ఎంఎల్‌ఎ కొలికపూడి చెప్పి రెండు నెలలవుతున్నా నేటికీ టెండర్లు పిలవలేదన్నారు. ఈ నేపథ్యంలో అసలు నిధులు మంజూరయ్యాయో లేదో ప్రజల్లో సందేహం నెలకొందన్నారు. ప్రజలకు మాయమాటలు చెబుతున్నారని విమర్శించారు. వైసిపి ప్రభుత్వ హయాంలో అప్పటి సిఎం జగన్మోహనరెడ్డి రూ.27 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించి మోసం చేశారని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు మంచి చేయకపోగా నియోజకవర్గంలో ఉన్న సహజ వనరులను ఎంపి, ఎంఎల్‌ఎ దోచుకొని, పంపకాలపై పంచాయితీలు పెట్టుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కట్టలేరుపై వంతెన నిర్మించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మేకల నాగేంద్ర ప్రసాద్, పి.వి.ఆంజనేయులు, సీనియర్ నాయకులు సానికొమ్ము నాగేశ్వరరెడ్డి, గువ్వల సీతారామిరెడ్డి, గంపలగూడెం మండల కార్యదర్శి మద్దిరెడ్డి వెంకటరెడ్డి, సిపిఎం నాయకులు మీసాల గోపి, పానెం ఆనందరావు, వి.నాగరాజు, సాంబారు వెంకటేశ్వర్లు, జెట్టి వెంకటేశ్వరరావు, మల్లవరపు కుటుంబరావు, చెరుకు వీరారెడ్డి, బి.వెంకటేశ్వరరావు, నందిగామ జనార్ధన చారి, తెల్లూరి శాంత కుమారి, కారెడ్ల ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

15 రోజుల్లో తాత్కాలిక రోడ్డు : ఆర్‌డిఒ

సమస్య తీవ్రంగానే ఉందని, ఈ విషయాన్ని కలెక్టర్ దష్టికి తీసుకెళ్లామని, ప్రభుత్వంతో కలెక్టర్ మాట్లాడుతున్నారని ఆర్‌డిఒ కే మాధురి చెప్పారు. వర్షాలు అధికంగా కురవడం, తెలంగాణ నుండి వరద ఎక్కువగా వస్తుండడంతో కట్టలేరు వాగు తాత్కాలిక రోడ్డు నిర్మించలేకపోతున్నామని తెలిపారు. 15 రోజుల్లో తాత్కాలిక రోడ్డును నిర్మిస్తామని సిపిఎం నేతలకు హామీ ఇచ్చారు. డిసెంబర్ మొదటి వారం నాటికి హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి టెండర్లు పిలవని పక్షంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని సిపిఎం నేతలు హెచ్చరించారు.

స్పందించిన జాయింట్ కలెక్టర్

సిపిఎం ఆందోళనపై జాయింట్ కలెక్టర్ ఇలక్కియ స్పందించారు. గంటల సమయంలోనే గంపలగూడెం చేరుకొని ధ్వంసమైన కట్టలేరు వంతెన పరిశీలించి, సిపిఎం నాయకులతో మాట్లాడారు. తుపాను అనంతరం తాత్కాలిక రహదారి వెంటనే ఏర్పాటు చేస్తామని తెలిపారు. అనంతరం వంతెన శాశ్వత నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. జాయింట్ కలెక్టర్‌కు సిపిఎం నాయకులు వినతి పత్రం సమర్పించారు. జెసి వెంట తిరువూరు ఆర్డీవో కే మాధురి, తహశీల్దారు వడ్డేశ్వరపు రాజకుమారి తదితరులు ఉన్నారు.

హై అలర్ట్

మందిని పునరావాస శిబిరాలకు తరలించారు.

ఎన్‌టిఆర్ జిల్లాలో 189 పునరావాస కేంద్రాలు, పలు రైళ్లు రద్దు

ఎన్‌టిఆర్ జిల్లాలోనూ 189 పునర్వావాస కేంద్రాలతోపాటు జిల్లా, డివిజన్ స్థాయిల్లో కమాండ్ కంట్రోల్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. జిల్లా యంత్రాంగం ప్రమాదకరంగా ఉన్న దాదాపు 175 హోర్డింగ్ పాయింట్లను తొలగించింది. కొండ చరియల ముప్పు ఉన్న ప్రాంతాల్లో 365 ఇళ్లు, ఇండ్లు, శిథిలావస్థలో ఉన్న 37 భవనాలను గుర్తించి ఆ ప్రాంతంలో ఎవరూ లేకుండా చర్యలు తీసుకున్నారు. విజయవాడలో మంగళవారం 16 సెంమీకుపైగా వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరించడంతో విఎంసి అధికారులు అప్రమత్తమయ్యారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావొద్దని సూచించారు. తీవ్రత ఎక్కువగా ఉంటే దుకాణాలు, వాణిజ్య సంస్థలు మూసివేయాలని విజ్ఞప్తి చేశారు. కలెక్టరేట్లో 9154970454, విఎంసి ప్రధాన కార్యాలయంలో 08662424172, 08662422515, 08662427485 నెంబర్లను అందుబాటులో ఉంచారు. ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ, పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు, జెసి ఎస్.ఇలక్కియ, విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర, డిఆర్‌ఒ లక్ష్మీనరసింహం తదితరులు సోమవారం తుపానుపై సమీక్షించి సంబంధత అధికారులకు తగిన సూచనలు చేశారు. కొండ ప్రాంతాలు, బుడమేరుపై ప్రత్యేకంగా దష్టిసారించాలని ఆదేశించారు. అంతేగాక పలు ప్రాంతాల్లో సుడిగాలి పర్యటన చేశారు. పునరావాస కేంద్రాలను పరిశీలించారు. రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ పర్యటించారు. అనంతరం విజయవాడలో డివిజన్ అధికారులతో సమావేశమై పలు సూచనలు చేశారు. తీసుకున్న చర్యలను జిఎంకు డిఆర్‌ఎం మోహిత్ సోనాకియా వివరించారు. ప్రయాణీకుల భద్రత దష్ట్యా దాదాపు 100 రైలు సర్వీసులను రద్దు చేశారు. 43 రైళ్లను ఈస్ట్‌కోస్ట్ రైల్వే రద్దు చేయగా.. విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో మరో 54 రైళ్లను రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు వెల్లడించారు.

తుపాను ఎఫెక్ట్

ఇతర పంటలతో పాటు కూరగాయతోటలు ముంపునకు గురయ్యాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఐదు రోజులుపాటు భారీ వర్షాలు కురిశాయి. ఈ నేపథ్యంలో కూరగాయల తోటలు దెబ్బతినడంతో దిగుబడి గణనీయంగా పడిపోయింది. వెంటనే బంగాళాఖాతంలో మరో తుపాను ఏర్పడింది. ముందస్తు చర్యల్లో భాగంగా ప్రజలు కూరగాయలు నిల్వ చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. డిమాండ్‌కు తగిన ఉత్పత్తి లేకపోవడంతో ధరలు అనూహ్యంగా పెరిగాయి. ఈ నెల 20వ తేదీతో పోలిస్తే రైతు బజార్లలో టమోటా కిలో రూ.12, వంగ రూ.9, బెండ రూ.16, కాకర రూ.2, బీర రూ.2, క్యాబేజీ రూ.4, క్యారెట్ రూ.14, దొండ రూ.16, బంగాళాదుంప రూ.6, చామదుంప రూ.2 వరకు ధరలు పెరిగాయి. తుపాను ప్రభావంతో రైతు బజార్లలో అవసరమైన మేరకు కూరగాయలు అందుబాటులోకి రాలేదు. సోమవారం ఉదయం 10 గంటలకే రైతు బజార్లలో కూరగాయలు లేకపోవడంతో వినియోగదారులు ఎక్కువ మంది ప్రయివేటు దుకాణాల్లో కొనుగోలు చేశారు. దుకాణాల వద్ద రద్దీ ఏర్పడటంతో ధరలు ఒక్కసారిగా పెంచేశారు. రైతు బజార్లలో ప్రకటించిన ధరలకు రెట్టింపుకుపైగా పెంచి విక్రయించారు. టమోటా కిలో రూ.80, బీర కిలో రూ.70, దోస కిలో రూ.50 క్యాబేజీ కిలో రూ.50, దొండ రూ.60, క్యారెట్ రూ.80కు విక్రయించారు. ఈనెల 20 నుంచి రైతుబజార్లలో పెరిగిన కూరగాయల ధరలు పట్టికలో చూడవచ్చు.

రకం(కిలో రూ.ల్లో)	20న	25న	27న
టమోటా	27	33	39
వంగ	26	38	35
బెండ	20	28	36
పచ్చిమిర్చి	30	30	24
కాకర	30	32	32
బీర	35	35	37
క్యాబేజీ	24	26	28
క్యారెట్	48	58	62
దొండ	24	38	40
బంగాళాదుంప	24	29	30
గోరు చిక్కుళ్లు	38	42	42
చామదుంప	28	30	30
దోస	20	20	20

పునరావాస కేంద్రాలు ఏర్పాటు

• ఏర్పాట్లు పరిశీలించిన అధికారులు • అప్రమత్తంగా ఉండాలని సూచనలు

ప్రజాశక్తి-మొవ్వ: మొంథా తుపానులో ఇబ్బంది పడే కుటుంబాల కోసం మొవ్వ మండలంలో నిడుమోలు, భట్ల పెనుమర్రు, పెదపూడి, మొవ్వ, కోసూరు, కాజ జిల్లా పరిషత్ హైస్కూళ్ళలో ఆరు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి ఆ కేంద్రాల్లో వంట సామాగ్రి, నిత్యవసర వస్తువులను, ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేశారు. ఆకేంద్రాల్లోని వసతులను, ఏర్పాట్లు మండల ప్రత్యేక అధికారిగానున్న డిప్యూటీ కలెక్టర్ కుముదినిసింగ్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. సోమవారం ఉదయం నుంచి వాతావరణంలో ఏర్పడిన మార్పులతో ప్రస్తుతం ఒకొక్క కేంద్రంలో 20 మందికి భోజనాల సౌకర్యాలను అధికారులు ఏర్పాటు చేశారు. **ప్రజాశక్తి మోపిదేవి :** మోపి దేవి మండలం మెరకనపల్లి, చిరువోలు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం తుఫాన్ బాధితుల పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసింది. సోమవారం ఉదయం మెప్మా పీడీ, నియోజకవర్గ ప్రత్యేక అధికారి పెనుమూడి సాయిబాబు చిరువోలులోని కేంద్రాన్ని పరిశీలించారు.

కూరగాయలను వితరణ : మోపిదేవి మండల పరిధిలోని కోసూరువారిపాలెం గ్రామంలో గల జిల్లా పరిషత్ హై స్కూల్ లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి పంచాయతీ సర్పంచ్ కోసూరు అనూష కూరగాయలను వితరణగా అందజేశారు. పునరావాస కేంద్రంలో ఉన్న 40 మందికి సర్పంచ్ అనూష, జనసేన పార్టీ నేత కోసూరు శివనాగమల్లేశ్వరరావు దంపతులు కూరగాయలను స్వచ్ఛందంగా అధికారులకు అందించారు. జనసేన పార్టీ యువ నేత యక్కటి నరేష్ తన వంతుగా కూర అరటికాయలను అలాగే దొమ్ము మల్లికార్జునరావు తన వంతుగా బియ్యం కట్ట, నిత్యవసర సరుకులను అందజేశారు.**ప్రజాశక్తి -నాగాయలంక :** తీర గ్రామాల్లో ఎలాంటి ప్రాణనష్టం జరగకూడదని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ స్పష్టం చేశారు. మొంథా తుఫాన్ నేపథ్యంలో సోమవారం ఎమ్మెల్యే బుద్ధప్రసాదు నాగాయలంక మండలంలోని పునరావాస కేంద్రాలు పరిశీలించారు. సంగమేశ్వరం గ్రామంలోని ఎంపీపీ స్కూలులో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రం, నాలి గ్రామంలో ఎంపీయూపీ స్కూల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు. ఆయా శిబిరాలలో 150 మంది తుఫాన్ బాధితుల కోసం అధికారులు చేసిన ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే బుద్ధప్రసాదు మాట్లాడుతూ తుఫాన్ బాధితులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఎలాంటి ప్రాణ నష్టం కలుగకుండా సముద్ర, నది తీర గ్రామాల్లో బలహీన ఇళ్ళు, గుడిసెలు, గుడారాలు, పూరిళ్ళల్లో నివసించే వాళ్ళు ఇంకా ఎవరైనా ఉంటే గుర్తించి శిబిరాలకు చేర్చాలని సూచించారు. తుఫాన్ తీరం దాటే వరకు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. నాలి సర్పంచ్ నాయుడు బాలకృష్ణ, ఇరిగేషన్ ఏఈఈ పొన్నూరు రవితేజ, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.**ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** గుడ్ల వల్లేరు మండలంలో ఆరు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. కవుతరం జడ్పి హై స్కూల్, వడ్లమన్నాడు జడ్పి హై స్కూల్, గుడ్లవల్లేరు ఎస్ ఇ ఆర్ ఎం జూనియర్ కాలేజ్, అంగలూరు జెడ్.పి. హై స్కూల్, విన్నకోట జెడ్.పి. హై స్కూల్ మరియు డోకిపర్రు గవర్నమెంట్ హై స్కూల్‌లలో ఏర్పాటు చేశారు. ఈ పునరావాస కేంద్రాలను ఎంపీడీవో మహమ్మద్ ఇమ్రాన్, తహసీల్దార్ బీ లోకరాజు, ఎస్సై ఎన్ వివి సత్యనారాయణ సోమవారం అవసరమైన ఏర్పాట్లను పరిశీలి ంచారు. పంచాయతీ కార్యదర్శులు సచివాయ ఉద్యోగులు అందరు నిరంతరం గ్రామాలలో కలియ తిరుగుతూ గ్రామస్తులకు తగు జాగ్రత్తలు చేశారు. **ప్రజాశక్తి మచిలీపట్నం రూరల్ :** మచిలీపట్నం మండలంలోని 34 గ్రామ పంచాయితీల ప్రజలంతా అప్రమత్తంగా ఉంటూ అవసరమైన వారు సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని ఎంపిడివో సిహెచ్ వెంకటేష్ కోరారు. ఈ సందర్భంగా సోమవారం పలు గ్రామాలలో ఎంపిడివో పర్యటించి అక్కడి ప్రజలతో మాట్లాడుతూ మొంథా తుఫాన్ నేపథ్యంలో 100 కిలోమీటర్ల పైగా వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని ప్రజలందరూ అధికారులు ఏర్పాటు చేసిన శిబిరాలకు రావాలన్నారు. పునరావాస కేంద్రంలలో ఏర్పాట్లు పరిశీలించారు.**ప్రజాశక్తి -గూడూరు :** మొంథా తుఫాను నేపథ్యంలో గూడూరు మండలానికి ప్రత్యేక అధికారిగా నియమితులైన జిల్లా మైనారిటీ అధికారి అబ్దుల్ రబ్బానీ సోమవారం గూడూరు మండలంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం ఆకులమన్నాడు గ్రామంలో ఏర్పాటు చేసిన పునరావాస శిబిరాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ డి.రాజ్యలక్ష్మి, ఎంపిడివో పి. శైలజ కుమారి, వీఆర్వో వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మొంథ తుపాను నేపథ్యంలో గూడూరు మండలంలో రెవిన్యూ అధికార యంత్రాంగం పూర్తిగా అప్రమత్తంగా ఉందని గూడూరు తహసీల్దార్ డి . రాజ్యలక్ష్మి తెలిపారు. ఆయా పాఠశాలలో పునరావాస శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. పునరావాస శిబిరాలలో ఉన్న వారికి భోజన వసతులు ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని రాజ్యలక్ష్మి తెలిపారు. ప్రజలు ఏ సమయంలో నైనా కంట్రోల్ రూమ్ నెంబర్ 99086 64607 కు ఫోన్ చేయవచ్చని తహసీల్దార్ తెలిపారు. **ప్రజాశక్తి-ఉంగుటూరు (గన్నవరం) :** గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు మండలాల్లో తుఫాను ప్రభావంతో ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్త చర్యగా లోతట్టు ప్రాంతాల నుండి నివాసితులను సురక్షిత ప్రదేశాలకు తరలిస్తున్నారు. గన్నవరం మండలం, కేసరపల్లి పంచాయతీలోని చెంచుల కాలనీ, వడ్డెర కాలనీల నుండి 150 కుటుంబాలను కేసరపల్లిలోని జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించారు. ఈ సందర్భంగా తాసిల్దార్ శివరావ్ మాట్లాడుతూ అన్ని ప్రాంతల్లోనూ పునరావాస కేంద్రాలను గుర్తించి, అవసరమైతే త్వరితగతిన తరలింపు కోసం సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.అలాగే ఉంగుటూరు మండలంలో కూడా అత్యవసర పరిస్థితి ఏర్పడినట్లయితే వారిని తరలించే అన్ని ఏర్పాట్లు చేసినట్లు తాసిల్దార్ జే విమలా కుమారి తెలిపారు. **ప్రజాశక్తి - గుడివాడ :** గుడివాడరూరల్ మండలంలోని లింగవరం గ్రామంలో డేరాలలో నివాసముంటున్న 62 మందిని ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించినట్లు తాలూకా ఎస్ఐ నంబూరు చంటిబాబు తెలిపారు. సోమవారం లింగవరం గ్రామంలో చిన్నచిన్న డేరాలు వేసుకుని జీవనం కొనసాగిస్తున్న వారిని మొంథా తుఫాన్ తీవ్రతను వివరించి వారిని సురక్షిత ప్రాంతాలకు వెళ్ళాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా ట్రైనీ ఎస్ఐ టి లోకేశ్వరి, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.**ప్రజాశక్తి - పెదపారుపూడి(గుడివాడ) :** మొంథా తుఫాన్ వల్ల పెదపారుపూడి మండల అధికారులు, కూటమి నాయకులు కలసి మండలంలోని వెంట్రప్రగడ జడ్పీ హైస్కూల్లో ఏర్పాటు పునరావాస కేంద్రాలను సోమవారం పరిశీలించారు. ఈ కేంద్రంలో లోతట్టు ప్రాంత ప్రజలను ఏ సమయంలోనైనా తరలించే అవకాశం ఉందని తాసిల్దార్ శ్రీను నాయక్ తెలిపారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని వర్షాలు కురిసే సమయంలో ఇంట్లో నుండి బయటకు రావద్దని సూచించారు. అలాగే నిత్యవసర వస్తువులను కూడా ముందుగానే ఏర్పాటు చేసుకోవాలని తెలియజేశారు. ఎంపీడీవో జె విమాదేవి, ఎస్ఐ ప్రవీణ్, రెవెన్యూ, పంచాయితీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-అవనిగడ్డ :** తుఫాన్ నేపథ్యంలో కోడూరు, నాగాయలంక, అవనిగడ్డ మండలాల్లోని ప్రజలను వివిధ రాజకీయ పార్టీల నాయకులు అప్రమత్తం చేస్తున్నారు. సోమవారం టిడిపి నాయకులు పులిగడ్డ గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలను కలిసి తుఫాను గురించి అప్రమత్తం చేశారు. గ్రామాలలో ప్రజలు పునరావాస కేంద్రాలకు తరలి వెళ్లాలని అక్కడ అవసరమైన అన్ని సౌకర్యాలు ప్రభుత్వం కల్పించిందని ప్రజలకు వివరించారు. ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, మండలి రామ్మోహన్రావు, పర్చూ రీ దుర్గాప్రసాద్, బండే రాఘవ, గుంటూరు వినయ్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిచ్చి ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.



నాగాయలంకలో పునరావాస బాధితులను పరామర్శిస్తున్న బుద్ధప్రసాదు



గుడ్లవల్లేరు మండలంలో పర్యటిస్తున్న అధికారులు



గుడివాడలో స్థానికులతో మాట్లాడుతున్న ఎస్ఐ

అధికారులు సమన్వయంతో పనిచేయాలి : ఎంఎల్ఏ

ప్రజాశక్తి-ఉయ్యూరు : మొంథా తుపాను ముంచు కొస్తున్న పరిస్థితుల్లో అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రాణనష్టం లేకుండా ఆస్తినష్టం లేకుండా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ సూచించారు. తుపాను హెచ్చరికల నేపథ్యంలో సోమవారం ఉయ్యూరు మున్సిపల్ కార్యాలయంలో మండలస్థాయి అధికారులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. తుపాను ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు శాఖలవారిగా చేపట్టిన చర్యలు తెలుసుకుని పలుసూచనలు చేశారు. రేకుల షెడ్లు, పూరుగుడిసెలు, శిధిలావస్థలో ఉన్న ఇళ్లలో నివసి ంచే వారిని పునరావాస కేంద్రాలకు తరలించి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. వర్షాలకు పంటలు ముంపుకు గురై రైతులు నష్ట పోకుండా మురుగుకాల్వల పూడిక యుద్ధప్రా తిపదికన చేపట్టాలన్నారు. విద్యుత్ ఉద్యోగులు అప్రమత్తతో ఉండి ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనాలన్నారు. గ్రామపంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లోనే ఉండి ప్రజలకు అవ సరమైన ఏర్పాట్లు చేసి ఏవిధమైన అసౌకర్యం కలుగకుండా చూడాలన్నారు. తహసీల్దార్ సురేశ్ కుమార్, ఉయ్యూరు కమిషనర్ రామారావు, చైర్మన్ సత్యనారాయణ, సీఐ టీవీవీ రామారావు పాల్గొని పలు సూచనలు చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఏ బోడే ప్రసాదు

తీర గ్రామాల్లో ముంపు సమస్య రాకుండా చర్యలు : బుద్ధప్రసాదు

ప్రజాశక్తి-అవనిగడ్డ : మొంతా తుఫాన్ నేపథ్యంలో తీర గ్రామాల్లో ముంపు సమస్య తలెత్తకుండా డ్రైనేజీలను సమర్ధవంతంగా నిర్వహించాలని ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ సూచించారు. సోమవారం ఎమ్మెల్యే కార్యాల యంలో డ్రైనేజ్ శాఖ ఈఈబి. కిరణ్ బాబుతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, తీర గ్రామాలతో పాటు నియోజకవర్గంలో ఎక్కడ ముంపు సమస్య రాకుండా క్షేత్రస్థాయి పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ రైతులకు ఎలాంటి నష్టం కలక్కుండా శ్రద్ధ వహించాలని సూచించారు. డ్రైనేజీల్లో వలకట్టు లేకుండా చూసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో డి ఈ జె. బాబు నాయక్, ఏఈఈ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడు అరెస్టు

ప్రజాశక్తి-ఉంగుటూరు : ఉంగుటూరు మండలంలోని నారయ్య అప్పారావుపేట గ్రామంలో తొమిదేళ్ల బాలికపై అత్యాచారయత్నం కేసులో వృద్ధుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. గ్రామానికి చెందిన నిమ్మకూరి రత్నం (65) బాలికకు మాయ మాటలు చెప్పి తోటల్లోకి తీసుకొని వెళ్లి అత్యాచారం చేయడానికి ప్రయత్నించడంతో స్థానికులు గమనించి ఆత్కూరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆత్కూరు పోలీసులు వృద్ధుడిని అరెస్టు చేసి గన్నవరం న్యాయస్థానంలో హాజరుపరిచారు.

సిపిఎం అభిమాని మృతి

ప్రజాశక్తి-బంటుమిల్లి : గుండాబత్తుల ఆంజనేయుల సహచరుడు, సిపిఎం సానుభూతి పరుడు బుద్ధుల నాగేశ్వరరావు (97) సోమవారం అనారోగ్యంతో కృత్తివెన్ను మండలం నీలిపూడి గ్రామంలో మృతిచెందారు. గుండా బత్తుల ఆంజనేయులు, ఇల్లూరి రాఘవయ్య నాయకత్వంలో బుద్ధుల నాగేశ్వరరావు అనేక రైతాంగ పోరాటాల్లో వ్యవసాయ కార్మికులకు పోరాటాల్లో పాల్గొన్నారు. 2019 వరకు సిపిఎం సభ్యుడిగా కొనసాగుతూ తరువాత అనారోగ్యం భారినపడడంతో పార్టీ సానుభూతిపరుడుగా ఉన్నారు. ఆయనకి ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఆయన మూడో కుమారుడు బుద్ధుల శివ (శ్రీ రైతు సంఘం కార్యక్రమాల్లో పాల్గొంటారు. నాగేశ్వరరావు భౌతికకాయాన్ని సిపిఎం కృష్ణాజిల్లా కమిటీ సభ్యులు, బంటుమిల్లి మండల కార్యదర్శి మాజీటి శివ శ్రీనివాసరావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు, సిపిఎం మండల కమిటీ సభ్యులు లంకదాసుల అజయ్ ఘోష్, వెంట్రపాటి రాంబాబు తదితరుతు సందర్శించి నివాళులర్పించి ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.




పామర్రులో అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ డికె బాలాజీ

ఎలాంటి నష్టం రాకుండా చూడాలి : కలెక్టర్

ప్రజాశక్తి-పామర్రు : తుఫాను వల్ల ప్రాణహాని లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ బాలాజీ అధికారులకు సూచించారు. పామర్రులోని కంచర్ల విజయలక్ష్మి భవనం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాన్ని సోమవారం సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం జిల్లా కలెక్టర్ అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో సమావేశమై తుపాను ముం దస్తు ఏర్పాట్లపై సమీక్షించారు. పూరిల్లు, పాత ఇల్లు,పడిపోయే ఇళ్లపై దృష్టి కేంద్రీకరించి అందులో నివసించే వారందరినీ పునరావాస కేంద్రంలోకి సురక్షితంగా తరలించాలన్నారు. మంచినీటి కొరత రాకుండా చూడాలని అవసరమైతే ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. తుఫాను వలన ఈదురు గాలులు వీస్తాయని చెట్లు విద్యుత్ స్తంభాలు పడిపోయే అవకాశం ఉందన్నారు. వాటిని వెంటనే తొల గించి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు.పునరావాస కేంద్రంలో నిత్యవసర సరుకులు అందుబాటులో ఉంచాలని మంచి ఆహారం అందించాలన్నారు.ఈ పర్యటనలో కలెక్టర్ వెంట ఉయ్యూరు ఆర్డీఓ బిఎస్ హేలా షారోన్,డిఎల్డిఓ రాజేష్,గృహ నిర్మాణ సంస్థ ఈఈ వెంకటరావు, తహసీల్దారు రవికాంత్,ఎంపీడీవో జ్యోతి, తదితర ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-నందివాడ :** మండలం పుట్టగుంట వద్ద బుడమేరు నందివాడ పునరవాస కేంద్రాలను కలెక్టర్ బాలాజీ, జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ,డీఎస్పీ ధీరజ్ వినీల్‌తో పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 188 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామని, మచిలీపట్నంకి ఎన్డీఆర్ఎఫ్ బందం వచ్చిందని, గుడివాడ కి మరొక బృందం వస్తుందని అన్నారు. ప్రజలు ఎవరు లోతట్టు ప్రాంతాల్లో ఉండవద్దని, పునరావాస కేంద్రాల్లో సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు.

హై అలర్ట్

- మొంథాపై అధికారులు అప్రమత్తం
- సమీక్షలు, విస్తృత పర్యటనలు
- పునరావాస కేంద్రాలు ఏర్పాటు
- నేడు విజయవాడకు భారీ వర్ష సూచన



మొంథా తుపాను నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లా కలెక్టర్ లక్ష్మీశతో పాటు ఇతర అధికారులు జిల్లాలో సోమవారం విస్తృతంగా పర్యటించారు. పునరావాస కేంద్రాలను పరిశీలించారు. మండలాల్లో తుపాను పరిస్థితిపై సమీక్షలు నిర్వహించారు. క్షేత్రస్థాయి సిబ్బందిని అప్రమత్తం చేశారు. పుసరావాస కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించారు. మంగళవారం విజయవాడకు భారీ వర్ష సూచన నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు.



తిరువూరులో పర్యటిస్తున్న జెసి ఇలక్కియ

అధికారుల విస్తృత పర్యటనలు

ప్రజాశక్తి-తిరువూరు, ఇబ్రహీంపట్నం, గంపలగూడెం

ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ ఆదేశాల మేరకు సంయుక్త కలెక్టర్, ఆర్డీవోలు సోమవారం జిల్లాలో విస్తృతంగా పర్యటించారు. సంయుక్త కలెక్టర్ ఎస్.ఇలక్కియ కొండపల్లిలో పర్యటించి.. ముంపు పొంచిఉన్న ప్రాంతాలను సందర్శించి ప్రజలను అప్రమత్తం చేశారు. జిల్లా పరిషత్ పాఠశాలలో, ట్రక్ టెర్మినల్ వద్ద ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాలను పరిశీలించారు. తిరువూరు ఆర్డీవో కే మాధురితో కలసి తిరువూరులోని భగత్ సింగ్ కాలనీ, గంపలగూడెం పునరావాస కేంద్రం, కట్టలేరు వాగు బ్రిడ్జిని పరిశీలించారు. నందిగామ ఆర్డీవో కే.బాలకష్ణ జగ్గయ్యపేట పురపాలక సంఘ పరిధిలోని విలియమ్స్ పేటను, ఊర చెరువును పరిశీలించగా, విజయవాడ ఆర్‌డీవో కావూరి చైతన్య 46వ వార్డులోని దుర్బల (వల్నరబుల్) భవనాలను, సితార సెంటర్ వద్ద కొండ చరియల ముప్పు ఉన్న ప్రాంతాలలో పర్యటించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా తుపానును ఎదుర్కొనేందుకు చేసిన ఏర్పాట్లను అధికారులు పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. పాత తిరువూరులోని భగత్ సింగ్ కాలనీని వరద ముంపు ప్రాంతంగా అధికారులు గుర్తించారు. తుఫాను సమయంలో నీటిమునిగే పరిస్థితుల ను, డ్రైనేజ్ వ్యవస్థను, అవసరమైన ముందస్తు చర్యలను జెసి పరిశీలించారు. తుఫాను సమయంలో అత్యవసర చర్యలు తీసుకోవాలని, లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలను అవసరమైతే సురక్షిత ప్రదేశాలకు తరలించే ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన సదుపాయాలు, యంత్ర సామగ్రి, సిబ్బంది అందుబాటులో ఉంచాలన్నారు. గంపలగూడెం మండలంలోని కట్టలేరు వాగును సందర్శించి వాగు వద్ద కొట్టుకుపోయిన తాత్కాలిక రోడ్డును ఆమె పరిశీలించారు. పెద్ద కొమెరలో ఉన్న ఇంటిగ్రేటెడ్ బాయ్స్ హాస్టలను పరిశీలించి, తుపాను బాధితులకు పునరావాస కేంద్రంగా మార్చాలని జెసి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కె.మాధురి, తాసిల్దార్ వడ్డేశ్వరపు రాజకుమారి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఇబ్రహీంపట్నంలోని ట్రక్కు టెర్మినల్, కొండపల్లిలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను జెసి పరిశీలించారు. అనంతరం లోతట్టు ప్రాంతాలైన కొండపల్లిలోని ఏపీహెచ్‌ఎన్‌ఎల్ రోడ్డు, పుట్లమ్మ గట్టు వద్ద గట్టు దిగువన వున్న ప్రాంతాలను కొండపల్లి మున్సిపాలిటీ కమిషనర్ రమ్య కీర్తనతో కలిసి పరిశీలించారు. **వీరులపాడు:** తాసిల్దార్ రవికుమార్ ఎప్పటికప్పుడు పరిస్థితిని ఆరా తీశారు. ఎస్సై అనిల్‌కుమార్ పోలీస్ సిబ్బందిని అప్రమత్తం చేశారు.

ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు

- గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో 189 పునరావాస కేంద్రాలు
- ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



అధికారులతో సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

ప్రజాశక్తి-విజయవాడ: మొంథా తుపాను నేపథ్యంలో ప్రజల భద్రతకు భరోసా కల్పిస్తూ, ఎక్కడా ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరక్కుండా గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు పూర్తి అప్రమత్తంగా ఉన్నామని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు.కలెక్టర్ డా. జి.లక్ష్మీశ.. కలెక్టరేట్‌లోని శ్రీ ఏవీఎస్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ హాల్ కమాండ్ కంట్రోల్ కేంద్రంలో సోమవారం జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, పోలీస్ కమిషనర్ ఎస్‌వీ రాజశేఖరబాబుతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ మార్గదర్శకాలు, సూచనలకు అనుగుణంగా తుపానుతో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నామని... చెట్లు విరిగిపడేందుకు, వరద ముంపు సంభవించేందుకు, రోడ్లు దెబ్బతినేందుకు అవకాశమున్న ప్రాంతాలను ప్రత్యేక తనిఖీల ద్వారా గుర్తించి, ప్రమాదాలు జరక్కుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిపారు. లోతట్టు, కొండ చరియలు విరిగిపడేందుకు అవకాశమున్న ప్రాంతాల వారిని సురక్షితంగా ఉంచేందుకు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో 189 పునరావాస కేంద్రాలను సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. వైద్య బృందాలను కూడా సిద్ధంగా ఉంచామని.. గర్భిణీలు, తక్షణ వైద్య సహాయం అవసరమైన వారిని సమీప ఆసుపత్రుల్లో ఉంచి సేవలు అందించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం వరి పంటకు నష్టం వాటిల్లకుండా వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు అందుబాటులో ఉన్నారని.. పంట కోతను వాయిదా వేసుకునేలా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఒకవేళ ఎక్కడైనా వరి, పత్తి పంటలను కోసినా, వాటిని సురక్షితంగా ఉంచేందుకు చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ వెల్లడించారు. కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ కేంద్రం (91549 70454) ఏర్పాటు చేశామని తెలిపారు.

కొండ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి

ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సోమవారం జిల్లాలో సుడిగాలి పర్యటన చేశారు. మొంథా తుపాను నేపథ్యంలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరక్కుండా క్షేత్రస్థాయిలో చేసిన ఏర్పాట్లను పరిశీలించడంతో పాటు అధికారులు, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. విజయవాడ అర్బన్ పరిధిలో సున్నపుబట్టీల సెంటర్, గ్రంథాలయ రోడ్డు ప్రాంతంలో ఈ నెల 24న కొండ చరియలు విరిగిపడిన ప్రాంతాన్ని కలెక్టర్ లక్ష్మీశ.. విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్రతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ కొండ ప్రాంతాల్లో కొండ చరియలు విరిగిపడే ప్రమాదమున్న ప్రాంతాలపై దృష్టి సారించి నివాసితులను పునరావాస శిబిరాలకు తరలించి అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ప్రమాదం పొంచి ఉండే ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మొగల్రాజపురం బీఎస్‌ఆర్‌కే మునిసిపల్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. పిన్నమనేని పాలీ క్లినిక్ రోడ్డులోని విపత్తు ప్రతిస్పందన పాయింట్‌ను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ వద్ద పరిస్థితిని పరిశీలించారు.

నేడు విజయవాడలో భారీ వర్షం

ప్రజాశక్తి-విజయవాడ

మొంథా తుపాను ప్రభావంతో ఈ నెల 28న విజయవాడ నగరంలో 162 మిల్లీమీటర్ల భారీ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిక జారీ చేసినందున నగర ప్రజలు సురక్షితంగా తమ ఇళ్లల్లోనే ఉండాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర కోరారు. విజయవాడ నగరంలోని దుకాణాలు, వాణిజ్య సంస్థలు మూసివేయాలని కోరారు. లేనట్లయితే ఇబ్బందులు తప్పవని అన్నారు. ప్రజలు అత్యవసర సేవల కోసం మాత్రమే (ఆరోగ్య, ఆహార సేవలకు) బయటకు రావాలని కోరారు. మెడికల్ షాపులు, కూరగాయలు, పాలు విక్రయ కేంద్రాలు వంటి అవసరమైన సేవా కేంద్రాలు మాత్రమే తెరిచి ఉంచవచ్చునని అన్నారు. అనవసర ట్రాఫిక్ రద్దీని నివారించాలని కోరారు. అనవసర ప్రయాణాలు, షాపింగ్, వినోదం, ఉదయ వాకింగ్, పార్కుల సందర్శనలు తదితర వాటిని వాయిదా వేసుకోవాలని కోరారు. అత్యవసర పరిస్థితుల్లో జిల్లా కమాండ్ అండ్ కంట్రోల్ రూమ్ నెంబర్ 9154970454, విఎంసి కంట్రోల్ రూమ్ నెంబర్ 0866 2424172, 0866 2422515, 0866 2427485లకు సంప్రదించాలని కోరారు.

పలు మండలాల్లో తేలికపాటి వర్షం

మోంథా తుఫాను ప్రభావంతో ఎన్‌టిఆర్ జిల్లాలోని పలు మండలాల్లో చల్లటి గాలులతో కూడిన తేలికపాటి వర్షం కురిసింది. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం నాలుగు గంటల సమయానికి జిల్లాలో 35.3 మి.మీ వర్షపాతం నమోదైంది.

పునరావాస కేంద్రాలు ఏర్పాటు



పునరావాస కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, కమిషనర్

ప్రజాశక్తి-విజయవాడ: మొంథా తుఫాను ప్రభావం కారణంగా నగర పరిధిలోని ఆయా ప్రాంతాల, ముఖ్యంగా కొండ ప్రాంతాల ప్రజలకు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామని, వాటన్నింటినీ పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర కోరారు. సోమవారం కష్ణవేణి స్కూల్ రోడ్, పటమట, విఎంసి పాఠశాల, సత్యనారాయణపురం, ఏలూరు రోడ్, వన్ టౌన్, గాంధీజీ మున్సిపల్ స్కూల్ ప్రాంతాలన్నీ పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముందుగా కష్ణవేణి స్కూల్ రోడ్లో జరుగుతున్న అవుట్ ఫాల్ డ్రైన్ నిర్మాణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎన్టీఆర్ సర్కిల్, పటమట, బెంజ్ సర్కిల్ వద్ద వర్షపు నీటి నిల్వలు ఉండకుండా శాశ్వత పరిష్కారంలో భాగంగా నిర్మిస్తున్న అవుట్ ఫాల్ డ్రైన్ నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) డాక్టర్ డి. చంద్రశేఖర్, చీఫ్ ఇంజనీర్ ఆర్ శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ కె అర్జునరావు పాల్గొన్నారు. **మైలవరం:** తుపాన్ కారణంగా మైలవరంలో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తాసిల్దార్ అబ్దుల్ దరియా తెలిపారు. మైలవరంలో వివిఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, షాదీ ఖానా, వెల్వడంలో లక్కిరెడ్డి పాపులమ్మ మెమోరియల్ జడ్పీహెచ్ఎస్ స్కూల్, చంద్రాల, టి గన్నవరం గ్రామాలకు సంబంధించి జడ్పీహెచ్ఎస్ స్కూల్ చంద్రాల, గణపవరం గ్రామాలకు జడ్పీహెచ్ఎస్ స్కూల్, కీర్తిరాయినిగూడెం, వెదురుబీడం, కనిమేర్ల గ్రామాలకు ఎంపీపీ స్కూల్ కీర్తి రాయునిగూడెం, తోలుకోడుకు ఎంపీపీ స్కూల్, పొందుగల గ్రామానికి జడ్పీహెచ్ఎస్ స్కూల్, చంద్రగూడెం, జంగాలపల్లి, సబ్జపాడు గ్రామాలకు జడ్పీహెచ్ఎస్ స్కూల్ చంద్ర గూడెం, పుల్లూరు, దాసులపాలెం గ్రామాలకు జడ్పీహెచ్ స్కూల్ పుల్లూరు, మరుసు మల్లి, ములకలపెంట గ్రామాలకు సంబంధించి మరుసుమల్లి జడ్పీహెచ్ఎస్ స్కూల్‌ను పునరావాస కేంద్రాలుగా ఏర్పాటు చేసినట్లు తాసిల్దార్ తెలిపారు. **రెడ్డిగూడెం:** రెడ్డిగూడెం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో, రంగాపురం కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయంలో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామని తహసీల్దార్ సుశీలదేవి తెలిపారు. ఈ కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించామని తెలిపారు. అలాగే ప్రజలకు మైక్ ప్రచారం ద్వారా అవగాహన కల్పించామని తెలిపారు. **నందిగామ:** తుపాన్ ప్రభావం వల్ల ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తుగా పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని నందిగామ మునిసిపల్ కమిషనర్ జి.లోవరాజు తెలిపారు. పాత బస్టాండ్ బాబు జగజ్జీవన్ రామ్ ఫంక్షన్ హాల్ , జిల్లా పరిషత్ హై స్కూల్, మధిర రోడ్డు నందు కేంద్రీయ విద్యాలయం నందు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. **విస్సన్నపేట:** పుట్రెల గ్రామం జిల్లా పరిషత్ హైస్కూల్‌ను సోమవారం అధికారులు పరిశీలించారు. అనంతరం గ్రామాల్లో రైతులకు, ప్రజలకు తుపాన్ పట్ల అప్రమత్తంగా ఉండాలని సలహాలు సూచనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ కే.లక్ష్మి కళ్యాణి, ఎంపీడీవో చిన్న రాట్నాలు పాల్గొన్నారు. **జగ్గయ్యపేట:** మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, నందిగామ ఆర్డీవో బాలకృష్ణ, తహసిల్దార్ మనోహర్, మున్సిపల్ కమిషనర్ తులసి వెంకట కృష్ణారావు, సిఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ రాజు పలు ప్రదేశాలను పరిశీలించారు. పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలను పునరావాస కేంద్రంగా ఏర్పాటు చేశారు.

ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

- జోనల్ ప్రత్యేకాధికారి ఆర్పీ సిసోడియా

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : మొంథా తుపాను కారణంగా జిల్లాలో ఎలాంటి ప్రాణ నష్టం జరక్కుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని తుపాను జోనల్ ప్రత్యేక అధికారి, చేనేత జౌళి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, జిల్లా ఎస్పీ వీ విద్యాసాగర్ నాయుడు, జాయింట్ కలెక్టర్ ఎం నవీన్ తో కలసి మొంథా తుపాను ప్రభావంతో జిల్లాలో సంభవించనున్న భారీ వర్షాలు, ఈదురు గాలులకు ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా ఉండేందుకు తీసుకోవలసిన ముందస్తు జాగ్రత్త చర్యలపై శాఖల వారీగా అధికారులతో చర్చించి దిశా నిర్దేశం చేశారు. జిల్లాలో తుపాను పరిస్థితులను ఎదుర్కొనేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో సమర్థవంతంగా పని చేయాలని సూచించారు. ముఖ్యంగా ఎలాంటి ప్రాణా నష్టం జరగకుండా ముందుగానే లోతట్టు ప్రాంతాలలోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. పునరావాస కేంద్రాలలో అవసరమైన సౌకర్యాలు కల్పించడంతోపాటు బిస్కెట్లు, బెడ్లు, తాగునీరు ఎక్కువమొత్తంలో నిల్వ చేసుకోవాలని, అవసరమైన ఔషధాలతో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. మూడు రోజులు ప్రజలందరూ ఇళ్లల్లోనే సురక్షితంగా ఉండేలా దండోరా వేయించి అప్రమత్తం చేయాలని, వారు ముందుగానే నిత్యవసర సరుకులు నిల్వ చేసుకునే విధంగా అప్రమత్తం చేయాలన్నారు. బీచ్‌ల వైపు సందర్శకు లెవరినీ అనుమతించకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి కే చంద్రశేఖర రావు, జడ్పీ సీఈవో కన్నమ నాయుడు, బందరు ఆర్డిఒ కే స్వాతి, ఇరిగేషన్ శాఖ ఎస్ఈ మోహన్ రావు, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ సోమశేఖర్, డిపిఓ డాక్టర్ జె అరుణ, డిఎంహెచ్వో డాక్టర్ యుగంధర్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్పీ సిసోడియా



ఉషా రామా ఇంజినీరింగ్ కళాశాలకు 'ఎక్సలెన్స్' అవార్డు

ప్రజాశక్తి-ఉంగుటూరు : బ్రెయిన్ ఓ విజన్ సంస్థ నిర్వహించిన 'భారత్ ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డ్స్ 2025'లో ఉషా రామా ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలకు 'కళాశాల ఎక్సలెన్స్ అవార్డు' లభించింది. దేశవ్యాప్తంగా 3000 ఇంజినీరింగ్ కళాశాలల నుండి 12 ప్రమాణాల ఆధారంగా ఎంపికైన 300 కళాశాలలలో ఇది ఒకటి. విద్యార్థుల ఆన్లైన్ పోలింగ్ ద్వారా ఈ ఎంపిక జరిగింది. ఈ కార్యక్రమంలోనే కళాశాల ప్రొఫెసర్ డా. కె.పి.ఎన్.వి. సత్యశ్రీకి 'జ్యేష్ట ఆచార్య అవార్డు' కూడా ప్రదానం చేశారు.ఈ అవార్డు రావడంపట్ల కళాశాల ఛైర్మన్ సుంకర రామబ్రహ్మం, ప్రిన్సిపల్ డా. జి.వి.కె .ఎస్.వి. ప్రసాద్‌లను పలువురు అభినందించారు.

టిడిపిలో అంతర్గత కుమ్ములాటలతో సంబంధం లేదు : పేర్ని నాని

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : గొడుగుపేట వెంకటేశ్వర స్వామి భూముల జోలికి తెలుగుదేశం నాయకులు వచ్చినందునే వారి అంతర్గత కుమ్ములాటలు బయటికి వస్తున్నాయని దానికి, వైసిపి పార్టీకి నాయకులకు ఎటువంటి సంబంధం లేదని మాజీ మంత్రి వైఎస్ఆర్సిపి కృష్ణా జిల్లా అధ్యక్షులు పేర్ని నాని పేర్కొన్నారు. ఆదివారం బందరులో ఆయన ఇంటివద్ద విలేకరులతో మాట్లాడారు. విజయవాడ ఎంపీ కేశినేని చిన్నిపై కీలక వ్యాఖ్యలు చేశారు. మచిలీపట్నం గొడుగు పేట వెంకటేశ్వర స్వామి ఆలయ భూములలో వేలు పెట్టిన విజయవాడ ఎంపీ చిన్ని పతనం ప్రారంభం అయిందన్నారు. తిరువూరు ఎమ్మెల్యే కొలికిపూడి శ్రీనివాసరావు అనే వ్యక్తిని యూట్యూబ్, టీవీలో తప్ప నేనెప్పుడూ ప్రత్యక్షంగా ఆయనను చూడలేదన్నారు. శ్రీనివాసరావుతో వైసీపీ నాయకులే అలా మాట్లాడిస్తున్నారని టిడిపి నాయకులు చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. పేకాట తప్ప వేరే ఆట తెలియని కేసినేని చిన్నిను ఆంధ్రప్రదేశ్ ఒలంపిక్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా నియమించిన ఘనత పాలకులకు దక్కుతుందన్నారు. మచిలీపట్నం గొడుగు పేట వెంకటేశ్వర స్వామి దేవుడు ఆస్తులపై కన్ను వేసినందుకే చిన్ని కు ఈ పరిస్థితి ఏర్పడింది అంటూ ముమ్మందు కేశినేని చిన్ని తో పాటు ప్రభుత్వ పెద్దలు కూడా ఇదే గతి పడుతుందని మాజీ మంత్రి పేర్ని నాని వ్యాఖ్యానించారు.


బందరులో విలేకరులతో మాట్లాడుతున్న పేర్ని నాని

వరి కోత యంత్రాలకు ఆదరణ

ప్రజాశక్తి-చల్లపల్లి : ప్రతికూల పరిస్థితుల్లో వరి పంటను కాపాడుకునేందుకు కూలీల సమస్యను అధిగమించేందుకు వరి కోత యంత్రాల వినియోగానికి ఆదరణ పెరుగుతోంది. చల్లపల్లి మండలంలో వరి కోత యంత్రాల అదరైర్డ్ డీలర్ దినేష్ మేక సోమవారం వరి కోత యంత్రాన్ని నెల్లూరు జిల్లా వాసి కటారి మునికి విక్రయించగా చల్లపల్లి కె.సిఐ ఈశ్వరరావు అందజేశారు. 25.52 లక్షల రూపాయలు విలువ చేసే వరి కోత యంత్రం పూర్తిగా స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో తయారు అయిందని, పనితీరు లో ఎన్నో ప్రత్యేకతలు ఉన్నట్లు దినేష్ తెలిపారు.కష్ణ గుంటూరు నెల్లూరు జిల్లాల పరిధిలో కంపెనీ డీలర్‌గా ఉన్నట్లు తెలిపారు. వరి కోత యంత్రం పంజాబ్ రాష్ట్రంలో తయారవుతుందని తెలిపారు.


యంత్రాన్ని అందిస్తున్న సిఐ ఈశ్వరరావు



వరిచేలో వచ్చిన నీటిని చూపుతున్న రైతు

వడ్లమన్నాడులో వరిపొలాలు మునక

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలో అస్తవ్యస్థంగా ఉన్న వడ్లమన్నాడు మురుగు కాల్వ వలన మండలంలోని వివిధ గ్రామాల్లో మురుగునీటి ముప్పు బారిన వరి పొలాలు పడ్డాయి. ఇప్పటికే వడ్లమన్నాడులో 700ఎకరాల్లో పొట్ట మీదున్న వరి మునక బారిన పడింది. డోకిపర్రు, లంకాదొడ్డి వరి పొలాలు మునకకు సిద్ధంగా ఉన్నాయి. ఇవే వరి పొలాలు ఎక్కువగా మునిగితే పంట కుళ్లిపోయే అవకాశం ఉంది. మరొక రెండు రోజుల పాటు తుపాను ఉండటంతో రైతులు బెంబేలెత్తి పోతు న్నారు. కేవలం వడ్లమన్నాడు డ్రెయిన్ అస్తవ్యస్థంగా ఉండటం వల్లనే ఈ దుస్థితి నెలకొందని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ కారణంగానే రైతులకు ఏటా తీరని నష్టం వాటిల్లుతుంది. వరి పంట నీటిలో మునిగితే కేవలం ఐదు రోజులు మాత్రమే బతుకుతుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అస్తవ్యస్థంగా ఉన్న డ్రెయిన్ కారణంగా ఆ రోజుల వ్యవధి కూడా దాటి పోతే తమ పంట పరిస్థితి ఏమిటని రైతులు బెంబేలు చెందు తున్నారు. మురుగు నీరు ఎగదన్నటంతో పొలాలు మరింతగా మునకకు గురవుతున్నాయని ఆందోళనకు గురవుతున్నారు.

డ్రెయిన్లలో పూడిక తీయాలని వినతి

ప్రజాశక్తి-బంటుమిల్లి : జిల్లాలో బంటుమిల్లి, కృత్తివెన్ను, గుడివాడ, గుడ్లవల్లేరు, కోడూరు మండలాల్లో డ్రెయిన్లు పూడిక తీసి పంట పొలాలను కాపాడాలని రైతు సంఘం కష్ణా జిల్లా కార్యదర్శిగౌరిశెట్టి నాగేశ్వరావు జిల్లా కలెక్టర్ డికె బాలాజీకి వినతి పత్రం అందజేశారు. తుపాను నేపథ్యంలో బంటుమిల్లి వచ్చిన కలెక్టర్‌తో ఆయన మాట్లాడుతూ డ్రెయిన్‌లలో పూడికలు తీసి తూడుతో నిండిన కాలువలను బాగు చేయాల న్నారు. తుఫాను ప్రభావం వల్ల వివిధ దశల్లో ఉన్న పంట పొలాలను ముంపు బారినుండి కాపాడాలని కోరారు. అలాగే జగనన్న కాలనీ వాసులు కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. కాలనీలో వేసిన బోరు నిరుపయోగంగా ఉందని, దీంతో మంచినీటకి ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో లంకదాసుల అజయ్ గోష్, ఎండి నజీర్, దుర్గ ప్రసాద్, కళ్యాణ్ శ్రీనివాస్ పాల్గొన్నారు



సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి - గుడివాడ : గుడివాడ నియోజవర్గంలోని 15 మంది బాధిత కుటుంబాలకు సిఎంఆర్ఆఫ్ చెక్కులను రాష్ట్ర గిడ్డంగలు సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు పంపిణీ చేశారు. సోమవారం స్థానిక ఏలూరు రోడ్డులోని టిడిపి కార్యాలయం ప్రజావేదికలో స్టేడియం కమిటీ వైస్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సోదరుడు వెనిగండ్ల రామకష్ణలతో కలసి రావి వెంకటేశ్వరరావు చెక్కులను అందించారు.

పామర్రు డిప్యూటీ ఎంపిడిఒగా జనార్ధన్‌రావు

ప్రజాశక్తి-పామర్రు : పామర్రు మండల పరిషత్ డిప్యూటీ ఎంపీడీవోగా పి.జనార్ధన్ రావు నియమితులయ్యారు. గుడివాడ రూరల్ మండలం మోటూరు గ్రామపంచాయతీ గ్రేడ్1కార్యదర్శి పనిచేస్తున్న జనార్ధన్ రావు పదోన్నతిపై పామర్రు మండలం ప్రజా పరిషత్‌కు డిప్యూటీ ఎంపీడీవోగా వచ్చారు. ఈ మేరకు జిల్లా జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ధ్వంసమైన రహదారులు నిర్మించాలని నిరసన

ప్రజాశక్తి - గుడివాడ : గుడివాడ పట్టణంలోకి వచ్చే బంటుమిల్లి రోడ్డు, బైపాస్ రోడ్డు, కోతి బొమ్మ సెంటర్ రోడ్డు, ఐఎంఎ రోడ్డు, ఏ రోడ్డు చూసినా గోతులు మయంగా తయారైయ్యాయని,పాడైన రహదారులను వెంటనే నిర్మించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి ఆర్‌సిపి రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం గుడివాడలో ప్రధాన రహదారులపై ఉన్న గుంతలను సిపిఎం నాయకులతో కలిసి పర్యటించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షం కురిస్తే రహదారులు బురద వల్ల నరకంగా ప్రజలకు ఇబ్బందికరంగా ఉందన్నారు. ఎప్పటికప్పుడు ప్యాచ్ వర్కులు చేస్తున్నారు తప్ప సరైన విధానంలో రోడ్లు పోయడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లు నిర్మించడానికి సరైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి రజిని, ఆర్ కొండ, బి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి గొడుగు బహూకరణ

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరు శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామివారి ఉత్సవమూర్తులకు రూ.15వేల విలువైన ఊరేగింపు గొడుగును అడుసుమిల్లి సుబ్బయ్య కుమార్తె కొల్లిపర సుష్మ, నాగేశ్వరరావు దంపతులు సోమవారం బహూకరించారు. కార్యక్రమంలో ఎస్ఈఆర్ఎమ్ విద్యా సంస్థల చైర్మన్ వల్లభనేని వెంకట్రావు, మాజీ జెడ్పీటీసీ కొసరాజు బాపయ్యచౌదరి, నెహ్రూ పశువుల సంత కమిటీ చైర్మన్ వల్లభనేని సుబ్బారావు, ఏఎంసీ చైర్మన్ పొట్లూరి రవికుమార్, దేవస్థాన ధర్మకర్తలు మురాల నరేష్, రవి తదితరులు పాల్గొన్నారు.



మెరుగైన సేవలతోనే గుర్తింపు

ప్రజాశక్తి-మచిలీపట్నంఅర్బన్ : జిల్లా కేంద్రంలో ఉన్న సర్వజన ఆస్పత్రిలో రోగులకు మెరుగైన సేవలు అందించడం ద్వారా మంచి గుర్తింపు తీసుకొచ్చారని బీసీ సంఘం నాయకులు సేకుపోయిన సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. సోమవారం బీసీ సంఘం ఆధ్వర్యంలో వైద్యాధికారులను ఘనంగా సన్మానించారు. మచిలీపట్నం సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ ఆశాలత, డిప్యూటీ సూపరింటెండెంట్ భానుమూర్తి, ఆర్.ఎం.ఓ నిరంజన్ లను కృష్ణాజిల్లా బీ.సీ సంక్షేమ సంఘం నాయకులు సోమవారం ఘనంగా సత్కరించి వారి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా బీసీ నాయకులు మాట్లాడుతూ గతంలో పలు సమస్యలపై డిప్యూటీ సూపరింటెండెంట్, ఆర్.ఎం.ఓ లకు వినతి పత్రం ఇవ్వగా వాటిపై సత్వరమే చర్యలు తీసుకుని సమస్యలను పరిష్కరించారన్నారు. ఈ కార్యక్రమంలో జన్ను గోవిందు, భోగి రెడ్డి సుభాని, నిక్కు రాధాకష్ణ, ధనికొండ చిన్ని, ఎం. రామరాజు, ఎం.గోపి, రత్తయ్య తదితర బీ.సీ నాయకులు పాల్గొన్నారు.

15 వరకు పారిశ్రామికవాడలో డ్రైవ్



ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: ఏపీఐఐసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అభిజిత్ కిషోర్ ఆదేశాల మేరకు ఏపీఐఐసీ ఇండస్ట్రీ పార్ట్నర్షిప్ డ్రైవ్ నవంబర్ 15 వరకు నిర్వహిస్తున్నట్లు ఐలా కమిషనర్ కె సీతామహాలక్ష్మి, ఐలా సెక్రెటరీ బి.కృష్ణారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా పారిశ్రామికవాడలో రోడ్లకు ఇరువైపులా చెత్తాచెదారం తొలగించడం, మరియు చెట్లు నాటడం, ప్రతి పరిశ్రమ నందు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకునే విధంగా ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. సోమవారం రోడ్లమీద ఉన్న చెత్తాచెదారం శుభ్రపరిచే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఐలా కమిటీ సభ్యులు, ఐలా మేనేజర్ టి భాస్కర్ పాల్గొన్నారు.

జె లగ్జరీ హెయిర్ ఆయుర్వేద సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: విజయవాడ నగరంలో నూతనంగా ఏర్పాటు చేసిన జె లగ్జరీ హెయిర్ బ్యూటీ ఆయుర్వేద సెంటర్‌ను ప్రముఖ హీరో నవదీప్, హీరోయిన్, బిగ్‌బాస్ బ్యూటీ దివి లాంఛనంగా ప్రారంభించారు. విజయవాడ నగరవాసుల కోసం అత్యాధునిక హంగులతో జె లగ్జరీ హెయిర్ బ్యూటీ ఆయుర్వేద క్లినిక్ ను ఏర్పాటు చేయడం అభినందనీయమని వారు పేర్కొన్నారు. విశాఖపట్నంలో ప్రఖ్యాతిగాంచిన జె లగ్జరీ హెయిర్ బ్యూటీ ఆయుర్వేద క్లినిక్ నిర్వాహకులు తమ సేవల విస్తరణలో భాగంగా విజయవాడలో కూడా సేవలు ప్రారంభించడం అభినందనీయమన్నారు. జె లగ్జరీ హెయిర్ బ్యూటీ ఆయుర్వేద క్లినిక్ నిర్వాహకులు వెన్న శ్రీకాంత్, వెన్న జ్యోతి మాట్లాడుతూ విశాఖపట్నంలో ప్రారంభించిన జే లగ్జరీ హెయిర్ బ్యూటీ ఆయుర్వేద క్లినిక్‌కు ప్రజల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. తమ సేవలను విజయవాడ ప్రజలకు కూడా అందించేందుకు సెంటర్ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. భవిష్యత్తులో తెలుగు రాష్ట్రాల్లో మరిన్ని క్లినిక్ ఏర్పాటు చేయాలని లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి, తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు గద్దె రామ్మోహన్ తనయుడు గద్దె క్రాంతి, కార్పొరేషన్ చైర్మన్ దుండి రాకేష్, బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్స్ కార్పొరేషన్ చైర్మన్ గొట్టు ముక్కల రఘురామరాజు, పిఎంఆర్‌డిఎ చైర్మన్ ప్రణవ్ గోపాల్, శాసన సభ్యులు సుందరపు విజయ్‌కుమార్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.



సిపిఎం నేత గోపాలరావుకు మాతృవియోగం

ప్రజాశక్తి-గంపలగూడెం: గంపలగూడెం గ్రామ సిపిఎం కార్యదర్శి మీసాల గోపాలరావు తల్లి సరస్వతి (85) వయోభారంతో సోమవారం మృతిచెందారు. ఆమెకు నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సరస్వతి మృతి పట్ల సిపిఎం జిల్లా కార్యదర్శి డివి కృష్ణ, జిల్లా కార్యవర్గ సభ్యులు గువ్వల సీతారాంరెడ్డి, మండల కమిటీ కార్యదర్శి మద్దిరెడ్డి వెంకటరెడ్డి, సిఐటియు మండల కార్యదర్శి జానపాటి వెంకటేశ్వరరావు, సభ్యులు మీసాల గోపి, బండి వీరబాబు, మల్లవరపు కుటుంబరావు తదితరులు సంతాపం తెలిపారు.



గుంటక ప్రభాకర్‌రెడ్డికి నివాళి

ప్రజాశక్తి-విజయవాడ సిటీ: విజయవాడ నగరపాలక సంస్థ వర్క్ ఇన్స్పెక్టర్‌గా, మున్సిపల్ ఎంప్లాయిస్ కోపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్గా, సిఐటియు నాయకులు గుంటక ప్రభాకర్‌రెడ్డి నిరుపమాన సేవలు అందించారని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ పేర్కొన్నారు. సోమవారం గుంటక ప్రభాకర్‌రెడ్డి సంస్మరణ సభ భవానిపురం కొండవీడు అకాడమీలో జరిగింది. ప్రభాకరరెడ్డి చిత్రపటానికి కాశీనాథ్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ఫ్లోర్ లీడర్ బోయి సత్య బాబు, మాజీ కార్పొరేటర్ గాదె ఆదిలక్ష్మి, దుర్గారావు పాల్గొన్నారు.



రక్తదానం ప్రాణదానంతో సమానం : తిలక్

ప్రజాశక్తి-నందిగామ: రక్తదానం ప్రాణదానంతో సమానమని నందిగామ ఏసీపీ తిలక్ అన్నారు. పోలీసు అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకుని పట్టణంలోని కమ్మ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని నందిగామ ఆర్డీవో బాలకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఏసిపి తిలక్ మాట్లాడుతూ శాంతిభద్రతల సంరక్షణలో పోలీసులు కీలకమన్నారు. పోలీసు అమరవీరుల సేవలను నిరంతరం స్మరించుకోవాలన్నారు. ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరు ఆరు నెలలకు ఒక్కసారి రక్తదానం చేయాలని కోరారు. ఈ కార్యక్రమం సిఐ వైవియల్ నాయుడు, మున్సిపల్ చైర్మన్ కృష్ణకుమారి, ప్రభుత్వ హాస్పిటల్ చైర్మన్ వేపూరి నాగేశ్వరరావు, పట్టణ అధ్యక్షులు ఏచూరి రాము, టిడిపి పట్టణ కార్యదర్శి కాసర్ల లక్ష్మీ నారాయణ, మున్సిపల్ కమిషనర్ లోవరాజు పాల్గొన్నారు.



ప్రమాదంలో క్వారీ కార్మికుడు మృతి

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: కేతనకొండలోని ఆర్‌పిఆర్ క్వారీలో సోమవారం జరిగిన ప్రమాదంలో ఉప్పుతల కృష్ణ (25) మృతిచెందాడు. బ్లాస్టింగ్ కోసం హోతాలు వేస్తున్న సమయంలో కొండపైన నుంచి జారీ పడిపోవడంతో ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. తీవ్రంగా గాయపడిన కార్మికుడిని ఇబ్రహీంపట్నం ప్రైవేటు హాస్పిటల్‌కి తరలించగా మృతిచెందాడు. ప్రమాదవశాత్తు మరణించిన కార్మికుని కుటుంబాన్ని క్వారీ యాజమాన్యం ఆదుకోవాలని, రూ.25 లక్షల నష్టపరిహారం చెల్లించాలి సిఐటియు ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి ఎం మహేష్ డిమాండ్ చేశారు. క్వారీల్లో భద్రతా ప్రమాణాలపై మైనింగ్ అధికారులు నిమ్మకు నిరేత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. క్వారీ కార్మికుల ప్రాణాలకు రక్షణ లేకుండా వ్యవహరిస్తున్న తీరు మార్చుకోకుండా పదేపదే కార్మికుల ప్రాణాలతో చెలగాట మాడుతున్న యాజమాన్యాలపై సమగ్ర దర్యాప్తు చేసి, క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.



ఉపాధ్యాయుడు గిరిధర్‌కు మాతృవియోగం

ప్రజాశక్తి-గంపలగూడెం: మండలంలోని సత్యాలపాడు గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు చిమట గిరిధర్ గోపాల్ తల్లి సుభద్రాదేవి (70) సోమవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతిచెందారు. ఆమెకు ముగ్గురు కుమారులు ఉన్నారు. సుభద్రాదేవి మృతదేహాన్ని గంపలగూడెం మండల పలు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులతో పాటు ఉపాధ్యాయులు సందర్శించి ఘనంగా నివాళులర్పించారు.



కొండపల్లిలో చైర్మన్ పర్యటన

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: మొంథా తుఫాన్ నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్ కొండపల్లి మునిసిపాలిటీ వార్డు కౌన్సిలర్ లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు కొండపల్లి మునిసిపాలిటీ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు వార్డుల్లో పర్యటించారు. ఏప ప్రాంతాల్లో డ్రైనేజీలు పొంగే అవకాశం ఉందో ఆయా డ్రైనేజీల పూడికలు తీయించారు.తుఫాన్ నేపథ్యంలో అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వెస్ట్ ఇబ్రహీంపట్నం ట్రక్ టెర్మినల్ వద్ద, కొండపల్లి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు .కొండపల్లి మునిసిపాలిటీ పరిధిలో ఇంకా ఏదైనా ప్రాంతాల్లో డ్రైనేజీ పొంగే అవకాశం ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ చుట్టుకుదురు శ్రీనివాస్, కౌన్సిలర్లు గోపాలరావు, విజయలక్ష్మి, రావి ఫణి, కొత్తపల్లి ప్రకాష్, ఏఈ మౌర్య గనియా పాల్గొన్నారు.

హుండీల ఆదాయం రూ.4.33 కోట్లు

ప్రజాశక్తి-విజయవాడ సిటీ: శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం హుండీల లెక్కింపు సోమవారం జరిగింది. మల్లికార్జున మహా మండపం ఆరవ అంతస్తు ప్రాంగణంలో గడిచిన 20 రోజులలో అమ్మవారికి యాత్రికులు 44 హుండీలలో సమర్పించుకున్న కానుకలను లెక్కించారు. దుర్గగుడి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో సీనా నాయక్, బోర్డు సభ్యుల సమక్షంలో జరిగిన హుండీల లెక్కింపులో మొత్తం రూ. 4,33,85,665 నగదు, 420 గ్రాముల బంగారం, 6 కిలోల 614 గ్రాముల వెండితో పాటుగా విదేశాల కరెన్సీ అమ్మవారి దేవస్థానానికి ఆదాయంగా లభించింది.

34 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి-తిరువూరు: తిరువూరులోని శ్రీవాహిని ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం జరిగిన బెంగళూరుకు చెందిన ప్రముఖ సాఫ్ట్‌వేర్ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ సంస్థ క్యూస్పైడర్స్ ఈ క్యాంపస్ నిర్వహించింది. మొత్తం 34 మంది విద్యార్థులు వివిధ సాఫ్ట్‌వేర్ ట్రైనింగ్, ప్లేస్‌మెంట్ అవకాశాలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ రంగా నాగేంద్రబాబు మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థుల కు కేవలం అకడమిక్ జ్ఞానమే కాకుండా, ఇండ స్ట్రీ అవసరాలకు తగిన నైపుణ్యాలపై కూడా శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ అధికారులు షేక్ షరీఫ్, మలినేని సత్య ప్రసాద్, కంపెనీ హెచ్ఆర్స్, కన్యక, శ్రీలేఖ, కరస్పాండెంట్ పోట్రు నాగేశ్వరరావు, సెక్రెటరీ ఊటుకూరు సుబ్రహ్మణ్యం, ట్రెజరర్ ముత్యాల కిషోర్‌బాబు పాల్గొన్నారు.

కొండపల్లి రైల్వేస్టేషన్ అభివృద్ధికి గ్రీన్‌సిగ్నల్

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: కొండపల్లి మున్సిపాలిటీతో పాటు మైలవరం నియోజకవర్గంలోని పలు గ్రామాల ప్రజల చిరకాల వాంఛ తీరబోతోంది. ఎట్టకేలకు కొండపల్లి రైల్వే స్టేషన్ అభివృద్ధికి రైల్వే శాఖ పచ్చజెండా ఊపింది. ఈ విషయాన్ని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ తెలిపారు. కొండపల్లి స్టేషన్‌లో ప్లాట్ ఫామ్ సక్రమంగా లేక ప్రయాణికులు ఎన్నో అవస్థలు పడుతున్నారు. ఈ అభివృద్ధి పనులతో ఆ ఇబ్బందులు అన్నీ తొలగిపోనున్నాయి. కొండపల్లి రైల్వేస్టేషన్ అభివృద్ధికి అడుగులు పడటంతో మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ సోమవారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. అభివృద్ధి చర్యలలో భాగంగా ప్లాట్ ఫారమ్ విస్తరణ, ఎత్తు పెంపు ప్రతిపాదనకు ఆమోదం లభించింది. త్వరలోనే పనులు ప్రారంభం కానున్నాయి.

మేక్‌మైట్రిప్ ట్రావెల్ ప్రారంభం

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: ప్రముఖ ట్రావెల్ కంపెనీ మేక్‌మైట్రిప్, ప్రయాణ సీజన్ ప్రారంభానికి గుర్తుగా రూపొందించిన కొత్త కేలండర్ మూమెంట్ 'ట్రావెల్ కా ముహూరత్'ను ప్రారంభించిందని సంస్థ ప్రతినిధి డి.కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. విమానాలు, హోటల్ వసతులు, హాలిడే ప్యాకేజీలు, గ్రౌండ్ ట్రాన్స్‌పోర్ట్, పర్యటనలు, ఆకర్షణలు వంటి సేవలతో పాటు వీసా, ఫారెక్స్, ట్రావెల్ ఇన్సూరెన్స్ వంటి ప్రయాణ నిత్యావసరాలను కూడా కలిపి, భారతదేశం, విదేశాలలోని ప్రముఖ విమానయాన సంస్థలు, హాస్పిటాలిటీ బ్రాండ్లు, ప్రధాన బ్యాంకింగ్ భాగస్వాములతో కలసి ప్రయాణికులకు అత్యుత్తమ విలువను అందిస్తోందని తెలిపారు. 'ట్రావెల్ కా ముహూరత్' ప్రారంభ ఎడిషన్ ఈ నెల 29 నుండి నవంబర్ 30 వరకు జరుగుతుందని తెలిపారు. ఎంఎంటిబ్లాక్ సభ్యులు ప్రత్యేక ముందస్తు యాక్సెస్‌ను పొందగలరని, ప్రతి శుక్రవారం బ్లాక్ ఫ్రైడే డీల్స్, లైట్నింగ్ డ్రాప్స్, పరిమిత ఇన్వెంటరీ ఆఫర్లు ఉంటాయని అన్నారు. ప్రతిరోజూ సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయని మేక్‌మైట్రిప్ సంస్థ ప్రతినిధి తెలిపారు.

శివకు అభినందన

ప్రజాశక్తి-వత్సవాయి: పెనుగంచిప్రోలు మండలానికి చెందిన జనసేన పార్టీ మండల అధ్యక్షుడు తునికిపాటి శివ విశ్వ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన సందర్భంగా శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) పెనుగంచిప్రోలులోని ఆర్యే ఫంక్షన్ హాల్‌లో శాలువాతో సత్కరించి అభినందించారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయిలో ప్రజాసేవ చేయాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.



చెట్లు తొలగింపు

ప్రజాశక్తి-రెడ్డిగూడెం : కోతుల వాగు వద్ద చెట్లు తొలగింపు, పూడికతీత పనులు చేపట్టారు. గ్రామంలో ప్రజలందరికీ తుపాను సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై మైకు ద్వారా తెలియజేశారు. జిల్లా పరిషత్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మల్లాది రాణి, ఉప సర్పంచ్ కొండపల్లి వెంకటేశ్వరరావు, మండల స్పెషల్ ఆఫీసర్ బాలాజీ కుమార్, తిరువూరు డివిజనల్ డెవలప్మెంట్ అధికారిణి వెంకటరమణ, తహశీల్దార్ సుశీల, ఎంపీడీవో రమణ, డిప్యూటీ ఎంపీడీవో ప్రభాకర్, ఆర్ఐ గంధం పుల్లయ్య పంచాయతీ కార్యదర్శి రామారావు పాల్గొన్నారు.

ముఖద్వారం పూర్తి

ప్రజాశక్తి-రెడ్డిగూడెం : రెడ్డిగూడెం మండల పరిధిలోని కొత్త నాగులూరు మాదిగలు నివసిస్తున్న ప్రాంతానికి స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూజగ్జీవన్ రామ్ ముఖద్వారం పనులు పూర్తి కావస్తున్నాయి. దీనిని మంద కృష్ణ మాదిగ చేతుల మీదుగా ప్రారంభించేందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు.

వ్యాన్‌లో డ్రైవర్ మృతి

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: మండలంలోని చిల్లకల్లు గ్రామ సమీపంలో భారత్ పెట్రోల్ బంకు వద్ద డీసీఎం వ్యాన్ డ్రైవర్ మృతిచెందాడు. వ్యాన్ నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు డోర్ తెరిచి చూడగా క్యాబిన్‌లో డ్రైవర్ చనిపోయి ఉన్నాడు. డీసీఎం యజమాని గత నాలుగు రోజులుగా డ్రైవర్ కోసం ప్రయత్నిస్తున్న క్రమంలో పోలీసులు సమాచారం అందించారు. ఉడిపి నుండి గుడివాడకు సరుకులు రవాణా చేసి తిరుగు ప్రయాణంలో పెట్రోల్ బంకు వద్ద వ్యాన్ నిలిపినట్లు తెలుస్తుంది. మృతదేహాన్ని శవ పంచనామా నిమిత్తం జగ్గయ్యపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

దొంగ అరెస్ట్

ప్రజాశక్తి-విజయవాడ: కోటి రూపాయలు విలువ చేసే బంగారపు వస్తువులను దొంగిలించిన ఇంటి దొంగను పోలీసులు అరెస్టు చేశారు. సిపి రాజశేఖర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం... సూర్యారావుపేట చిలుకు దుర్గయ్య వీధికి చెందిన వ్యక్తి ఇంట్లో చోరీ ఘటనపై నమోదైన కేసును సౌత్ ఏసిపి డి.పవన్‌కుమార్ పర్యవేక్షణలో ఇన్స్పెక్టర్ షేక్ అహ్మద్ అలీ దర్యాప్తు చేశారు. కొద్ది గంటల వ్యవధిలోనే గతంలో ఇంటి పని చేసిన మానేసిన చీపురుపల్లి సుమలతను సాంబమూర్తి రోడ్డులో పోలీసులు అరెస్టు చేసి సుమారు 850 గ్రాముల బంగారు వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.

మ్యాక్సివిజన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-హెల్త్ యూనివర్సిటీ: విద్యార్థులకు కంటి ఆరోగ్యం, సంరక్షణపై అవగాహన కల్పించడమే ధ్యేయంగా మ్యాక్సివిజన్ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో సీవీఎస్, రిఫ్రాక్టివ్ ఎర్రర్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు విజయవాడ మ్యాక్సీవిజన్ ఐ హాస్పిటల్స్, కన్సల్టెంట్ ఆప్తాల్మాలజిస్ట్ డాక్టర్ స్వాతి పిన్నమనేని తెలిపారు. కళాశాల విద్యార్థులలో పెరుగుతున్న కంప్యూటర్ విజన్ సిండ్రోమ్, రిఫ్రాక్టివ్ ఎర్రర్స్ అనగా అధిక స్క్రీన్ వినియోగం, మారుతున్న జీవనశైలి తదితర అంశాలపై అవగాహన కల్పించనున్నామన్నారు. ముందుగానే కంటి సమస్యలను గుర్తించడం, కంటి సంరక్షణ, ఆరోగ్యకరమైన స్క్రీన్ అలవాట్ల ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు తెలియజేయడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని చెప్పారు. ఈ కార్యక్రమంలో భాగంగా, శిక్షణ పొందిన ఆప్టోమెట్రిస్టులు, టెక్నీషియన్లు అధునాతన రోగనిర్ధారణ



సాధనాలను ఉపయోగించి క్యాంపస్‌లలోనే కంటి పరీక్షలను నిర్వహిస్తామని, విద్యార్థులు తమ కంటి ఆరోగ్యాన్ని తెలుసుకుని అవసరమైతే సకాలంలో వైద్య సంప్రదింపులు పొందడానికి వీలుగా పరీక్షా ఫలితాలు వారితో పంచుకోబడతాయన్నారు.

తీర ప్రాంతాల్లో ప్రత్యేకాధికారి ఆమ్రపాలి పర్యటన

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : మొంథా తుపాను నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కృష్ణాజిల్లాకు నియమించిన జిల్లా ప్రత్యేక అధికారి, పర్యాటక శాఖ ఎండి, ఆమ్రపాలి సోమవారం మధ్యాహ్నం జాయింట్ కలెక్టర్ ఎం నవీన్‌తో కలిసి మండలంలోని గరాలదిబ్బ, గిలకలదిండి గ్రామాలలో జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను సందర్శించి పరిశీలించారు. కేంద్రంలో ఆశ్రయం పొందిన ప్రజలతో ముఖాముఖి మాట్లాడి వారికి అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. కేంద్రంలో ఉన్న గర్భిణీలు, బాలింతలు, వృద్ధుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మంగినపూడి బీచ్ ను సందర్శించి అక్కడి వాతావరణ పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ బీచ్ వద్ద మీడియాతో మాట్లాడుతూ మొంథా తుపాను ప్రభావంతో 27 నుంచి 29వ తేదీ వరకు జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టామన్నారు. ముఖ్యంగా ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరక్కుండా ఉండేందుకు అవసరమైన చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఇప్పటికే, సముద్రంలోకి వేటకు వెళ్లిన మత్స్యకారులందరినీ వెనక్కి రప్పించామన్నారు. జిల్లావ్యాప్తంగా దాదాపు 188 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలందరిని తరలిస్తున్నామని తెలిపారు. సమాచార నిమిత్తం జిల్లా, డివిజన్, మండల స్థాయిల్లో కంట్రోల్ రూమ్ లు ఏర్పాటు చేశామని, మండల ప్రత్యేక అధికారులను కూడా నియమించినట్లు తెలిపారు. అదేవిధంగా రైతులెవ్వరు కూడా కోతలు కోయకుండా వాయిదా వేసుకునేలా అప్రమత్తం చేయడం జరిగిందని, ఒకవేళ ఎవరైన ఇప్పటికే కోత కోసి ఉంటే గనక ధాన్యం మొలకెత్తకుండా ఉండేందుకు దానిపై ఉప్పు ద్రావణం పిచికారీ చేసేవిధంగా క్షేత్ర స్థాయిలో రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. డిఆర్‌ఓ కే చంద్రశేఖరరావు, బందరు ఆర్డీవో కే స్వాతి, పర్యాటకశాఖ జిల్లా అధికారి జి. రామలక్ష్మణరావు, నగర మున్సిపల్ కమిషనర్ బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.



పునరవాస కేంద్రాల్లో మందులు పరిశీలిస్తున్న ఆమ్రపాలి



ముంపు ప్రాంతాలను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

పారిశుధ్యంపై దృష్టి సారించాలి : సిపిఎం

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : బందరు పట్టణంలో గత వారం రోజులుగా వర్షపు నీటితో ముంపుకు గురైన ప్రాంతాలను సోమవారం సిపిఎం జిల్లా నాయకులు పరిశీలించారు. ప్రజల ఆరోగ్యం పారిశుధ్యం పట్ల ప్రభుత్వం శ్రద్ధ వహించి ప్రజలకు అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వై నరసింహారావు డిమాండ్ చేశారు. మోకాళ్ళ లోతు నిలిచిన వర్షపు నీటిని మోటార్లతో బయటకు తోడించాలని, దోమలు ప్రబలకుండా క్రిమిసంహారక మందులు పిచికారి చేయించాలని, వీధిదీపాలు మరింత ప్రకాశవంతంగా వెలిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బూర సుబ్రహ్మణ్యం, చిరువోలు జయరావు, మద్ది పోలినాయుడు, జి రామకృష్ణ పాల్గొన్నారు.

సముద్రపు కరకట్ట గండ్లు పూడ్చాలి : లకనం

ప్రజాశక్తి -నాగాయలంక : మండలం గుల్లలమోద నుంచి కోడూరు మండలం పాలకాయతిప్ప వరకు ఉన్న సముద్రపు కరకట్ట గండ్లను యుద్ధ ప్రాతిపదికన పూడ్చాలని టీడీపీ నేత, ఆంధ్రప్రదేశ్ సాంప్రదాయ మత్స్యకారుల సేవా సమితి ప్రధాన కార్యదర్శి లకనం నాగాంజనేయులు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయన నాగాయలంకలో విలేఖర్లతో మాట్లాడుతూ 2023 ఆగస్టు16, 17న మండలి బుద్ధప్రసాద్ నాయకత్వంలో కరకట్ట పటిష్ట పర్చాలని కోరుతూ పాదయాత్ర నిర్వహించినప్పుడు సముద్రపుకు అక్కడక్కడ గండ్లు పడినట్లు గుర్తించామన్నారు. అధికారులు తక్షణం కరకట్టను పరిశీలించి గండ్లను గుర్తించి పూడ్చి పటిష్ట పర్చడం ద్వారా తీర ప్రాంత గ్రామాల ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు రక్షణ కల్పించాలని లకనం కోరారు.



బందరు రైతుబజారులో కూరగాయలు తీసుకెళ్తున్న ప్రజలు

రైతుబజార్లు కిటకిట

ప్రజాశక్తి-ఉయ్యూరు : మొంత తుపాను హెచ్చరికల నేపథ్యంలో కూరగాయల కోసం వినియోగదారులు ఎగ బడడంతో సోమవారం ఉయ్యూరులో రైతు బజార్లో దుకాణాలు, బయట కూరగాయల దుకాణాలు కిక్కిరిశాయి. తుపాను ప్రభావం మూడు రోజుల పాటు ఉంటుందన్న హెచ్చరికలు చేస్తున్న పరిస్థితుల్లో కూరగాయలు అందుబాటులో ఉండవేమో అన్న ఆతృతతో ఎక్కువ మొత్తంలో కొనుగోలు చేయడంతో కొద్దిసేపట్లోనే దుకాణాలు ఖాళీ అయ్యాయి. సందట్లో సడేమియా అన్నట్లు రైతుబజార్లో దుకాణ దారులు బోర్డు రేటు కన్నా ఎక్కువ రేటు డిమాండ్ చేసినా తప్పని పరిస్థితుల్లో వినియో గదారులు కూరగా యలు కొనుగోలుచేశారు. **ప్రజాశక్తి-మచిలీపట్నంఅర్బన్ :** తుపాను ప్రభావంతో ప్రజలు రెండు మూడు రోజులకు సరిపడా కూరగాయలు, నిత్యవసరాలు తీసుకోవడానికి మార్కెట్లకు, రైతుబజార్‌కి, షాపింగ్ మాల్స్ కు భారీగా తరలివస్తున్నారు. సోమవారం ఉదయం జోరున వర్షం కురుస్తున్న బందర్ రైతు బజారు కూరగాయలు కొను క్కునే వాళ్లతో రద్దీగా కనిపించింది. ఎనిమిది టన్నుల టమాటాలు మధ్యాహ్నం 12 గంటలకు ఖాళీ అయిపో యాయని ఎస్టేట్ అధికారి లంకే బలి చక్రవర్తి తెలిపారు. రేవతి సెంటర్లో ఉన్న రిలయన్స్ స్మార్ట్ స్టోర్ లో ఆదివారం సాయంత్రం ఐదు గంటల నుంచి 8 గంటల వరకు విపరీతమైన రద్దీ ఉన్నట్లు మేనేజర్ ఆంజనేయులు తెలిపారు. జిల్లా కలెక్టర్ స్థాయి ఉన్నతాధికారులు ప్రజ లకు సందేశం ఇస్తూ రెండు మూడు రోజులకు సరిపడా నిత్యవసరాలు దగ్గర పెట్టుకోవాలని సూచించడం వల్ల ప్రజలు ముందు జాగ్రత్తగా పాలు, పెరుగు, కూరగాయలు, నిత్యావసరాలు కొనుగోలుకు మార్కెట్లపై పోటెత్తారు.

ప్రజలంతా ఇళ్ళలోనే ఉండాలి : మున్సిపల్ కమిషనర్

ప్రజాశక్తి - గుడివాడ : మొంథా తుఫాన్ దృష్ట్యా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, ఎవరూ ఇళ్ళనుండి బయటకు రాకూడదని మున్సిపల్ కమిషనర్ ఎస్ మనోహర్ పేర్కొన్నారు. సోమవారం గుడివాడ పట్టణంలోని లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ మంగళవారం భారీ వర్షాలు నమోదు అయ్యే అవకాశం ఉందని, తుఫాన్ హెచ్చరికలు జారీ అయినందున ప్రజలందరూ ఇళ్లలోనే అప్రమత్తంగా సురక్షితంగా ఉండవలసిందిగా కోరారు. ఏ సమయంలో అయినా తక్షణ సహాయం కొరకు గుడివాడ పురపాలక సంఘం నందు ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్ నెంబర్ ను 87126 24774 సంప్రదించాలని తెలియజేశారు. లోతట్టు ఏరియాలను సందర్శించి ముందస్తు చర్యలు తీసుకుని ఎప్పటికప్పుడు బ్లాక్ డ్రైన్సను, కల్వర్టులను జెసిబీలతో, వర్కర్లతో క్లీన్ చేయించారు. నీరు నిల్వ ఉన్న ప్రాంతాలలో ఆయిల్ ఇంజన్లు, డీస్లడ్జింగ్ మిషన్లు పెట్టించి క్లియర్ చేయించడం జరిగిందన్నారు. మున్సిపల్ ఇంజనీర్ ప్రసాద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న కమిషనర్ మనోహర్



మాట్లాడుతున్న డ్వామా పిడి శివప్రసాద్

సమన్వయంతో తుపానును ఎదుర్కొందాం : డ్వామా పీడీ

ప్రజాశక్తి-అవనిగడ్డ : దూసుకు వస్తున్న మొంతా తుపానును ఎదుర్కొనేందుకు అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని డ్వామా పిడి శివప్రసాద్ యాదవ్ సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో తుపాను పరిస్థితులను ఎదుర్కొనేందుకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తుపాను ప్రభావం ఉండే ప్రాంతాలను గుర్తించి, పూరిల్లు, రేకుల ఇళ్లల్లో నివసించే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. మండలంలో 10 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండలంలో మొత్తం 120 గృహాలలోని 370 మందిని పునరవాస కేంద్రాలకు తరలిస్తున్నట్లు పీడీ తెలిపారు. ప్రతి పునరావాస కేంద్రానికి ఒక ఇన్చార్జిని నియమించగా, మండలం మతాన్ని తాసిల్దార్ కే నాగమల్లేశ్వరరావు పర్యవేక్షిస్తారని చెప్పారు. బాధితులకు భోజనం, వసతి, శానిటేషన్, త్రాగునీరు, మెడికల్ క్యాంపులు అన్ని రకాల సౌకర్యా లు అందే విధంగా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం పునరావాస కేంద్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎం మరియాదేవి, తాసిల్దార్ కె, నాగమల్లేశ్వరరావు, సీఐ జి, యువ కుమార్, ఎస్సై కె, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విరాళాలు అందజేత

ప్రజాశక్తి గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరు శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి, శ్రీ గంగానమ్మ దేవస్థానాల జీర్ణోద్ధరణ పనులకు పలువురు దాతల నుంచి విరాళాలు సోమవారం వచ్చాయి. వాసం రాజేశ్వరరావు రూ.5,116, మహారెడ్డి మురళీకృష్ణ రూ.10,116 విరాళాల్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈఆర్ఎమ్ విద్యా సంస్థల చైర్మన్ వల్లభనేని వెంకట్రావు, నెస్లూరా పశు వుల సంత కమిటీ చైర్మన్ వల్లభనేని సుబ్బారావు, పాల సంఘాధ్యక్షుడు వల్లభనేని బాపయ్యచౌదరి, దేవస్థాన ధర్మకర్తలు మూరాల నరేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

పునరావాస కేంద్రాలు సిద్ధం

ప్రజాశక్తి-చల్లపల్లి : మెంథా తుఫాన్ హెచ్చరిక నేపథ్యంలో ఎటువంటి పరిస్థితులైన ఎదుర్కునేందుకు చల్లపల్లి మండలంలో అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. ముందు జాగ్రత్త చర్యగా ప్రతి గ్రామంలో ఒక పునరావాస కేంద్రం ఏర్పాటు చేశారు. మండలంలో 11 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి, అధికారుల బృందం సహాయక చర్యలకు సిద్ధంగా విధుల్లో ఉన్నారు. భారీ వర్షాలు బలమైన గాలులో ప్రారంభం అయితే తుఫాను ప్రభావిత ప్రజలను తరలించేందుకు వీలుగా కేంద్రాలను సిద్ధం చేశారు. తుఫాను తీవ్రత ఉంటే చల్లపల్లి, ఆముదారులంక, మాజేరు, లక్ష్మీపురం గ్రామాలలో సుమారుగా 400 మందిని పునరావాస కేంద్రాలకు తరలించాల్సి వస్తుందని అంచనా వేశారు. సోమవారం సాయంత్రం వరకు భారీ వర్షం, ఈదురుగాలో లేకపోవడంతో ఎవర్ని కేంద్రాలకు తరలించలేదు. గ్రామాల్లో ఎంపిక చేసిన కేంద్రాలను తాసిల్దార్ బి. వనజాక్షి, సిఐ కె. ఈశ్వరరావు,ఎంపీడీవో ఆనందకుమారి, ఎస్ ఐ ఎస్ వి ఎస్ సుబ్రహ్మణ్యం పరిశీలించి, కార్యదర్శులకు, గ్రామ రెవెన్యూ అధికారులకు, సిబ్బందికి సూచనలు చేశారు.మండల ప్రత్యేక అధికారి డిప్యూటీ సీఈవో ఆర్ వి ఆనంద కుమార్ చల్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి,గ్రామాల్లో పరిస్థితిని అధికారులతో సమీపించారు .

నైపుణ్యాంతోనే ఉద్యోగాలు

ప్రజాశక్తి-కంకిపాడు : విజయవాడ ఎంఎస్ఎంఈ టూల్ రూమ్ (సిబిటిడి) ఉపకేంద్రం ఆధ్వర్యంలో స్థానిక ధనేకుల ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో ఈనెల 23, 24, 27 తేదీలలో మూడురోజులపాటు ఉద్యమితా అవగాహనా కార్యక్రమం జరిగింది. భారత ప్రభుత్వ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎంఆర్‌సెన్యూర్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని సెంట్రల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్ విజయవాడ శిక్షణ అధికారి పి చంద్రశేఖర్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ, యువతకు పరిశ్రమలకు సంబంధించిన నైపుణ్యాలను అందించడం ద్వారా స్వయం ఉపాధి అవకాశాలను పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రవి కడియాల, ఐటీ విభాగాధిపతి డాక్టర్ కె. సందీప్ ఎంఎస్ఎంఈ సంస్థ చేస్తున్న నైపుణ్యాభివృద్ధి ప్రయత్నాలను అభినందించారు. ఆధునిక తయారీ రంగంలో ఉద్యమితా ప్రాముఖ్యతను విద్యార్థులు అర్థం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమ నిర్వాహకుడు డాక్టర్ పి.వి. శివతేజ విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ వృత్తిపరమైన ఎదుగుదలకు మార్గం సిద్ధం చేసుకోవాలని ప్రోత్సహించారు.



సిద్ధాంతం పంటకాల్వ వంతెన మూసివేత

ప్రజాశక్తి - గుడివాడ : మొంథా తుఫాన్ దృష్ట్యా గుడివాడ రూరల్ మండలం సిద్ధాంతం పంట కాలువ వద్దగల వంతెన బలహీనంగా ఉండటం వలన తాత్కాలికంగా మూసివేసినట్లు గుడివాడ తాలూకా పోలీసులు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా తాలూకా ఎస్ఐ ఎన్ చంటిబాబు మాట్లాడుతూ ఈ వంతెన బలహీనంగా ఉండటం వల్ల ప్రమాదాలు జరగటానికి అవకాశం ఉన్నందున ఈ వంతెన మార్గమును ఉపయోగించే సిద్ధాంతం, శెరివేల్పూరు,చౌటపల్లి, పరిసర గ్రామ ప్రాంత ప్రజలు ప్రత్యామ్నాయ మార్గంలో ప్రయాణించాలని కోరారు.


వికాస్ రెయిన్‌బో స్కూల్ అధినేతకు అవార్డు

ప్రజాశక్తి - గుడివాడ : గుడివాడ వికాస్ రెయిన్బో స్కూల్ అధినేత పుట్టి రామచంద్రశేఖర్‌కు అబ్దుల్ కలాం జాతీయ ప్రతిభ అవార్డు అందుకున్నారు. స్థానిక సత్యనారాయణపురంలోని వికాస్ రెయిన్బో పాఠశాల అధినేత పుట్టి రామచంద్రశేఖర్ ప్రతిష్టాత్మక జాతీయ అబ్దుల్ కలాం ప్రతిభ అవార్డును సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్ అండ్ టీచర్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి గుంటూరులో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు, ఆర్గనైజేషన్ పెద్దలు అందజేశారు.

అప్రమత్తతతో నష్టాన్ని తగ్గించుకోవచ్చు

ప్రజాశక్తి-ఘంటసాల : మొంతా తుపాను పట్ల నిర్లక్ష్యం వహించకుండా అప్రమత్తంగా ఉండాలని ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్ బాబు కోరారు. సురేష్ బాబు సోమవారం మంటసాలలోని ఘోటకం ఏ కాలనీ ని సందర్శించి అక్కడ నివసించే నిరుపేద కుటుంబాల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ తుపాను పట్ల భయాందోళనలకు గురి కాకుండా, అధికారుల సూచనలను పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు.

మొంథాతో రైతుల్లో ఆందోళన


నందిగామలో వర్షాలకు నానుతున్న పత్తి

ప్రజాశక్తి-నందిగామ: మొంథా తుపానుతో పత్తి పంటలు దెబ్బతింటున్నాయి. ఎన్టీఆర్ జిల్లాలో ఈ ఏడాది 81,875 ఎకరాల్లో రైతులు పత్తి పంట సాగు చేశారు. నందిగామ, చందర్లపాడు, కంచికచర్ల, వీరులపాడు మండలాల్లో 31,500 ఎకరాల్లో సాగైంది. ఎకరానికి రూ.50 వేలకు పైగా పెట్టుబడి పెట్టారు. మంచి దిగుబడి వస్తుందని రైతులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కాయలు పక్వానికి వచ్చే తరుణంలో అధిక వర్షాలు నిలువునా ముంచాయి. దాదాపుగా ప్రతిరోజూ ఏదో ఒక సమయంలో వర్షం పడుతూనే ఉంది. పల్లపు, లోతట్టు భూముల్లో నీళ్లు నిలపటం వల్ల వేరుకుళ్లు తెగులు సోకింది. చెట్లు నిలువునా చచ్చిపోతున్నాయి. చేలు గుబురుగా ఉండటం, గాలి తగలకపోవటంతో రోజుల తరబడి తేమ అడటం లేదు. తేమ వల్ల ఫంగస్ తెగులు సోకటంతో తొలికాపు పూర్తిగా దెబ్బతింది. కొంత భాగం పూత, పిందెలు రాలిపోయాయి. అడుగు భాగం కాయలు బూజు పట్టి నల్లగా మారాయి. పక్వానికి వచ్చిన కాయలు సరిగ్గా విచ్చుకోక నల్ల బారాయి. చెట్టు అడుగుభాగంలో ఉన్న కాయపత్తి, గుడ్డిపత్తి తీయటానికి కూడా కూలీలు ముందుకు రావటం లేదు. వర్షాలకు మొక్కజొన్న, పెసర, మిర్చి పంటలకు నష్టం వాటిల్లుతుంది. తడిసిన మొక్కజొన్న జాతీయ రహదారి రోడ్డుపై ఆరబెడుతున్నా వర్షాలకు తడిసి కుళ్లిపోతుంది. **కంచికచర్ల:** మెట్ట పంటలు సాగు చేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే కురుస్తున్న వర్షాలకు పొలంలో మొదటిదశ పగిలిన పత్తి కారిపోయిందని, ప్రస్తుతం కాయ దశలో ఉన్న రెండోసారి పత్తి కూడా కుళ్లిపోయే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఈ ఏడాది క్వింటా పత్తి కూడా చేతికి రాదని రైతులు లబోదిబోమంటున్నారు. అలానే మొక్కజొన్న పంట చేతికి వచ్చినా కొనేనాథుడు లేక రైతులు ఇళ్లల్లో ఆరబోశారు. తుపాన్‌కు ఆరబోసి, ఇళ్లల్లో నిల్వ చేసిన మొక్కజొన్న కూడా తడిసిపోతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పలు రైళ్లు రద్దు

ప్రజాశక్తి-విజయవాడసిటీ: తుపాన్ నేపథ్యంలో ప్రయాణికుల భద్రత దృష్ట్యా దక్షిణ మధ్య రైల్వే చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ముందు జాగ్రత్తగా పలు రైళ్లు రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు. విజయవాడ డివిజన్ మీదుగా నడిచే 54 రైళ్లు రద్దు చేశారు. 28, 29 తేదీలలో బయలుదేరే పలు ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లు రద్దయ్యాయి. రాజమండ్రి, నిడదవోలు, గుంటూరు, కాకినాడ, తెనాలి, మార్కాపురం, మచిలీపట్నం, నర్సాపురం, విశాఖ, ఒంగోలు, భీమవరం, మాచర్ల నుంచి బయలుదేరే రైళ్లు రద్దయ్యాయి. రద్దు చేసిన రైళ్ల వివరాలు ప్రయాణికుల మొబైల్స్‌కు సందేశాలు పంపినట్లు అధికారులు తెలిపారు.

సంతకాల సేకరణకు స్పందన

ప్రజాశక్తి-విజయవాడ సిటీ : మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తు చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమం 54వ డివిజన్లో జయప్రదమైందని ఆ డివిజన్



వైసిపి అధ్యక్షుడు ఎస్.కె హుస్సేన్ బాషా తెలిపారు. 54వ డివిజన్లో సేకరించిన సంతకాల పత్రాలను పశ్చిమ నియోజకవర్గం ఇంచార్జ్ వెల్లంపల్లి శ్రీనివాసరావును పార్టీ కార్యాలయంలో కలిసి సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజు రమేష్, అలీక్, షేక్ అహ్మద్, షేక్ నజీరుద్దీన్, యూనిస్, సల్మా, వాసా బాబూ, శీను, అన్వర్ బేగ్, సునీల్, అహ్మద్ పాల్గొన్నారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: మండలంలోని అన్నవరం గ్రామానికి చెందిన దుస్సా మాధవి, అమరబోయిన శిరీష, యలమందల నాగమణి, చిన్నపొంగు రాణి ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ ఆసుపత్రుల్లో శస్త్రచికిత్సలు చేయించుకున్నారు. ఈ క్రమంలో నలుగురికి సిఎం సహాయ నిధి నుంచి రూ.1,39,614 మంజూరయ్యాయి. దీనికి సంబంధించి చెక్కులను ఎమ్మెల్యే రాజగోపాల్ తన నివాసంలో బాధితులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో దోగుపర్తి విష్ణు, యలమందల కవి, వడ్డేంపూడి సీతారాములు, కారుపాటి డేవిడ్, మల్లెల కొండయ్య, నాయిని రజిని, పల్లెబోయిన నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కల్తీ మద్యంతో సంబంధం లేదు

మాజీ మంత్రి జోగి రమేష్

ప్రజాశక్తి-విజయవాడ సిటీ: కల్తీ మద్యం కేసులో తనకు ఎటువంటి సంబంధమూ లేదని మాజీ మంత్రి జోగి రమేష్



తెలిపారు. సోమవారం తన కుటుంబ సభ్యులు, పార్టీ నేతలతో కలిసి ఇంద్రకీలాద్రి ఘాట్ రోడ్డుకు ఆయన చేరుకున్నారు. తనపై వస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తూ కామధేనువు అమ్మవారి ఆలయం వద్ద చేతిలో హారతి వెలిగించుకుని రమేష్ ప్రమాణం చేశారు. తనకు కల్తీ మద్యం కేసులో సంబంధం లేదని, తాను తప్పు చేయలేదని స్పష్టం చేశారు. తన వ్యక్తిత్వాన్ని దెబ్బతీయడానికే చంద్రబాబు నాయుడు కుట్ర పన్నుతున్నారని మండిపడ్డారు. రాజకీయంగా ఎదుర్కోలేక కల్తీ మద్యం కేసులో తనను ఇరికిస్తున్నారని తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. నిజ నిరూపణ కోసం లై డిటెక్టర్ టెస్టుకు సైతం తాను సిద్ధమని తెలిపారు.

అన్నదానం ప్రారంభం

ప్రజాశక్తి జగ్గయ్యపేట: పట్టణంలోని శ్రీ సంతాన వేణుగోపాల స్వామి దేవస్థానంలో ఓం శ్రీ వనపులి భక్త బృందం ఆధ్వర్యంలో అయ్యప్ప దీక్ష స్వీకరించిన స్వాముల కోసం సోమవారం నుండి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. మాజీ మంత్రి, జిల్లా కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురామ్ అన్నదానాన్ని ప్రారంభించారు.

తుపాన్‌పై సమీక్ష

ప్రజాశక్తి-కంచికచర్ల: మండలంలోని అన్ని గ్రామాల్లో ముందస్తు ఏర్పాట్లు చేసినట్లు కంచికచర్ల తహసీల్దార్ ఎన్.నరసింహారావు తెలిపారు. రెవెన్యూ యంత్రాంగంతో పాటు పోలీస్, ఎంపీడీవో, పంచాయితీ, ఫైర్ సిబ్బంది, ఎలక్ట్రికల్ తదితర అన్ని శాఖల అధికారులను సమన్వయం చేసుకొని తుపాను విపత్కర పరిస్థితులను ఎదుర్కొనుటకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించి తుపాను పరిస్థితులు సమర్థంగా ఎదుర్కోవడానికి తీసుకోవలసిన చర్యలను తాహసిల్దార్ వివరించారు. **జగ్గయ్యపేట:** పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గంలోని వివిధ శాఖలకు


జగ్గయ్యపేటలో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్

చెందిన అధికారులతో ఎమ్మెల్యే రాజగోపాల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తుపాను తీరం దాటుతున్న నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ప్రతి శాఖ సమన్వయంతో పని చేయాలని అధికారులను ఆదేశించారు.

ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: రాష్ట్రంలో పీపీపీ విధానానికి వ్యతిరేకంగా వైసిపి ఆధ్వర్యంలో చేపడుతున్న కోటి సంతకాల కార్యక్రమంతో కూటమి ప్రభుత్వ కళ్లు తెరిపిద్దామని వైసిపి రాష్ట్ర సోషల్ మీడియా వింగ్ ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్ దొడ్డా అంజిరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని బస్టాండ్ ఎదురుగా నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ వీరమాచినేని నవీన్ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలతో మమేకమై ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంతకాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ కార్పొరేటర్ పడిగపాటి చైతన్య రెడ్డి, వైసిపి జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి ఇంటూరి రాజగోపాల్ (చిన్న), పట్టణ అధ్యక్షులు, మున్సిపల్ వైస్ చైర్మన్ పఠాన్ ఫిరోజ్ ఖాన్, హఫీజున్నిసా బేగం, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మండవ శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర ఎంపీపీల సంఘం అధ్యక్షులు మార్కపూడి గాంధీ తదితరులు పాల్గొన్నారు. **వత్సవాయి:** మక్కపేట గ్రామంలో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కనగాల రమేష్, మామిళ్లపల్లి మురళి, కోణంగి సీతారామయ్య పాల్గొన్నారు.

పిబి సిద్ధార్థలో కంప్యూటర్స్ జర్నల్ విడుదల



ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: విజయవాడ పిబి సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం రూపొందించిన ఆన్‌లైన్ పత్రికను కళాశాల కన్వీనర్ నిమ్మగడ్డ లలితప్రసాద్ సోమవారం విడుదల చేశారు. ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ ఇంటెలిజెంట్ కంప్యూటింగ్ సిస్టం పేరుతో 31077218 అనే ఐఎస్ఎస్ఎన్ నంబరుతో అంతర్జాతీయ జర్నల్ అందుబాటులోకి తెచ్చినట్లు ప్రచురణకర్త, సహాయాచార్యులు గడ్డం సమ్రాట్ కృష్ణ, సంపాదక మండలి సభ్యుడు డా.టి.ఎస్.రవికిరణ్ తెలిపారు. ఈ జర్నల్ ద్వారా తృతీయ సంవత్సరం విద్యార్థులు తమ ప్రాజెక్ట్ వర్కులను పరిశోధన పత్రాలుగా ఆన్‌లైన్ సంచికలో ప్రచురించుకునే సౌలభ్యం ఉందని ప్రిన్సిపల్ డా. మేకా రమేష్ తెలిపారు. వివిధ కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులు, ఐటి నిపుణులు తమ పరిశోధన పత్రాలు ప్రచురించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ వేమూరి బాబూరావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్.వెంకటేశ్వర్లు, డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా. ఎం.మనోరంజని, ఐక్యూఎసి కోఆర్డినేటర్ డా.రాజేంద్ర ప్రసాద్, అకాడమిక్ ఆఫీసర్ జి.చక్రవర్తి, ఉపాధి కల్పన అధికారి కాపూరు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

పాతబస్తీని ముంపు నుండి కాపాడాలి

సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కాశీనాథ్, ఫ్లోర్‌లీడర్ సత్యబాబు

ప్రజాశక్తి-విజయవాడ సిటీ : పాలకులు మారుతున్నారే గానీ పాతబస్తీ ముఖచిత్రం మారడం లేదని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ పేర్కొన్నారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిపిఎం పశ్చిమ నగర కార్యదర్శి బోయి సత్యబాబు ఆధ్వర్యంలో సోమవారం సర్కిల్ వన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కాశీనాథ్ మాట్లాడుతూ సిపిఎం హయాంలోనే పాతబస్తీ ఘనీయమైన అభివృద్ధి సాధించిందని గుర్తు చేశారు. నేడు కొద్దిపాటి వర్షానికి ముంపు బారిన పడే పాతబస్తీని అభివృద్ధి చేయడంలో పాలకులు వైఫల్యం చెందుతున్నారని మండిపడ్డారు. మంచినీటి కాలుష్యాన్ని నివారించడంలో అటు పాలకులు ఇటు అధికారులు ఘోరంగా విఫలం చెందారన్నారు. రంగు మారిన నీరు దుర్వాసన వస్తుందని అనేకమార్లు కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చినా ఫలితం లేదన్నారు. వర్షాకాలం వచ్చిందంటే కొండ ప్రాంతవాసులు నిద్రలేని రాత్రులు గడుపుతున్నారని గుర్తు చేశారు. ప్రమాదకర ప్రదేశాలలో రిటైనింగ్ వాల్ నిర్మించాలని పోరాటాలు చేస్తున్నా పాలకుల్లో చలనం లేదన్నారు. కొండ ప్రాంతంలో దెబ్బతిన్న వాటర్ పైప్ లైన్లకు మరమ్మతులు చేపట్టడం లేదన్నారు. నూతన పైప్ లైన్లను ఏర్పాటు చేయాలని, మెట్ల మార్గాలు, సైడ్ డ్రైన్ నిర్మాణాలు చేపట్టాలని అనేకమార్లు వినతి పత్రాలు అందించిన నేటికీ ఆచరణకు నోచుకోలేదన్నారు. ప్రభుత్వ తీరు మారని పక్షంలో మేయర్, ఎమ్మెల్యేల ఇళ్లు, కార్యాలయాల ముట్టడికి కూడా వెనకాడమని హెచ్చరించారు. సిపిఎం పశ్చిమ నగర కార్యదర్శి, ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు మాట్లాడుతూ సాక్షాత్తు మేయర్ డివిజన్లో కొండ ప్రాంత రిటైనింగ్ వాల్ సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయంటే విజయవాడలో అధికారపక్షం పనితీరు ఏ విధంగా ఉందో అర్థం



సర్కిల్ వన్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

చేసుకోవచ్చన్నారు. ప్రజా సమస్యలను గాలికి వదిలేసిన కూటమి, వైసిపి కార్పొరేటర్లు విజ్ఞాన యాత్రల పేరిట విహారయాత్రలు చేస్తూ ప్రతి యేడాది కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని మండిపడ్డారు. పశ్చిమ నియోజకవర్గ ప్రజా సమస్యలను పరిష్కరించకపోతే ప్రత్యక్ష ప్రజా పోరాటాలకి దిగుతామని వాచ్చరించారు. అనంతరం నగరపాలక సంస్థ సర్కిల్ వన్ ఈఈ శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గాదె ఆదిలక్ష్మి, సిపిఎం పశ్చిమ నగర కమిటీ సభ్యులు కే సూరిబాబు, ఐవి నారాయణ, రాజు, కొండారెడ్డి, సిఐటియు నాయకులు సుబ్బారెడ్డి, కృష్ణ పాల్గొన్నారు.